UDYAM-TS-02-0308842 www.prathighatana.com

# ప్రతిఘటన

జనం కోసం..

తెలుగు దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 29 | పేజీలు : 8 | సోమవారం 23 ఫిబ్రవరి 2026 | వెల : 4/-

### ఆ ఐటీ కంపెనీ ఉద్యోగుల్లో ఫుల్ జోష్

దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో (౧జూ) పనిచేసే ఉద్యోగుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కారణం.. మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల త్రైమాసిక వేరియబుల్ పేను మూడో త్రైమాసికంలో గరిష్ఠంగా 80 శాతం వరకు పెంచింది. దాదాపు రెండేళ్లుగా తక్కువ స్థాయిలో కొనసాగిన చెల్లింపుల తరువాత ఇది గణనీయమైన మార్పుగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో మధ్య, సీనియర్ స్థాయి సిబ్బందికి వేరియబుల్ పే 20--50 శాతం మధ్యకే పరిమితమై ఉండేది. ఇప్పుడు అక్టోబర్--డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి చాలామంది మధ్యస్థాయి ఉద్యోగులు సుమారు 80 శాతం వేరియబుల్ చెల్లింపులు పొందినట్లు సమాచారం. సీనియర్ స్థాయి ఉద్యోగులకు 40--80 శాతం మధ్య చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. 'మనీ కంట్రోల్' కథనం ప్రకారం.. ఉద్యోగులకు జనవరిలో ఈ మొత్తాలు జమయ్యాయి.

### కొత్త నేతలను వెతికే పనిలో

# కాంగ్రెస్

- వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై ఇప్పటి నుంచే ఫోకస్
- వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం
- పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని హైకమాండ్ ఆదేశాలు

హైదరాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన తర్వాత నుంచి వరుసగా సాధిస్తున్న రాజకీయ విజయాలు, పాలనాపరమైన సంస్కరలపై కాంగ్రెస్ అధిష్ఠానం ప్రత్యేక దృష్టి పెట్టింది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ ఉపఎన్నికలు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధించడం పట్ల ఏఐసీసీ అగ్రనాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని మంత్రుల బృందం ఢిల్లీలో పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో చేపట్టబోయే భవిష్యత్ కార్యాచరణపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వచ్చే అసెంబ్లీ ఎన్నికలపై కూడా ఫోకస్ పెట్టినట్లు స్పష్టం చేసింది. పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన వారిని ఇన్‌ఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించాలని ఆదేశించారు. తెలంగాణలో గత రెండేళ్లలో పార్టీ సాధిస్తున్న పురోగతిని సమీక్షించడానికి ముఖ్యమంత్రి, మంత్రులు, పీసీసీ అధ్యక్షుడిని ఢిల్లీకి పిలిపించిన అధిష్ఠానం, దాదాపు రెండు గంటలపాటు లోతైన చర్చలు జరిపింది. జూబ్లీహిల్స్ ఉపఎన్నిక మొదలు కొని ఇటీవల ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికల వరకు కాంగ్రెస్ సాధించిన ఫలితాల పట్ల మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ సంతృప్తి వ్యక్తం

- మిగతా3లో

# ప్రజల ఆస్తులపై రేవంత్ కన్నుపడింది





- మూసీ పేరిట కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోంది
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు
- "కేసీఆర్‌కు మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది



### డిజిటల్ మోసాల బారిన పడొద్దు

- బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్ తరుచుగా మార్చండి
- కేవైసీ అప్‌డేట్, రీ కేవైసీ చేసేందుకు చిరాకు పడొద్దు
- బ్యాంకు ఖాతాల భద్రత కోసమే ఈ ప్రక్రియ
- 131వ మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



### ట్రంప్ మాస్టర్ ప్లాన్: ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

- ఇరాన్ సుప్రీం లీడర్‌ను లక్ష్యంగా చేసుకున్న అమెరికా
- మధ్యప్రాచ్యంలో భారీగా అమెరికా సైనికుల మోహరింపు
- చర్చలకు సిద్ధం.. యుద్ధానికీ సై అంటున్న ఇరాన్
- పరిమిత దాడుల ఆలోచనలో ఉన్నానన్న డొనాల్డ్ ట్రంప్
- పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయొచ్చని నిపుణుల హెచ్చరిక

### 'భారత ప్రతిభను ఇతర దేశాలకు ధారపోస్తున్నాం'




### తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు
### విజయ్ ఎక్కడ్నించి పోటీ చేయాలో చెబుతున్న కార్యకర్తలు

- 2026 ఎన్నికల్లో పెరంబూరు నుంచి పోటీ చేయాలంటూ విజయ్‌కు విజ్ఞప్తి
- చెన్నైలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించిన టీవీకే కార్యకర్తలు
- డీఎంకేకు చెన్నై కోట కాదంటూ సవాల్ విసిరిన పార్టీ నేతలు
- ఉత్తర చెన్నైపై దృష్టి సారించిన తమిళగ వెట్రి కళగం



### తమిళనాడులో భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- ఎనిమిది మంది అరెస్ట్
- ఐఎస్ఐ, బంగ్లాదేశ్ లింకులు
- దేశంలో ఉగ్రదాడికి ప్లాన్‌ను భగ్నం చేసిన పోలీసులు
- ఎనిమిది మంది అరెస్ట్



# రేవంత్‌రెడ్డికి బీజేపీ భయం పట్టుకుంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు.



హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బీజేపీ భయం పట్టుకుందని ఎద్దేవా చేశారు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. కామారెడ్డిలో బీజేపీకి చైర్మన్ పదవి రాకుండా చేశారని రాంచందర్‌రావు ధ్వజమెత్తారు. ప్రజాహక్కులను కాంగ్రెస్ ప్రభుత్వం కాలరాస్తుందని మండిపడ్డారు. బొల్లారం పీఎస్ నుంచి రాంచందర్ రావును విడుదల చేశారు. కామారెడ్డికి వెళ్లకూడదన్న షరతులతో ఆయన్ను విడుదల చేశారు పోలీసులు. అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఇదిలా ఉంచితే, నేడు చలో కామారెడ్డికి తెలంగాణ బీజేపీ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. దాంతో రాంచందర్ సహా, ముఖ్య నేతల ఇళ్ల దగ్గర పోలీసులు మోహరించి వారిని కామారెడ్డి వెళ్లకుండా అడ్డుకున్నారు. ముందస్తు అరెస్టులు చేశారు. ఈ క్రమంలోనే రాంచందర్ రావును బొల్లారం పీఎస్‌కు తరలించారు.



### కాంగ్రెస్ 'నగ్న' రాజకీయాలు చేయాల్సిన పనేంటి?

- దేశంలోనే వేగవంతమైన మెట్రో... మీరట్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ
- గంటకు 120 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో ప్రయాణించనున్న మెట్రో
- నమో భారత్ రైలు సేవలను కూడా ప్రారంభించిన ప్రధాని మోదీ
- పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చిన ఢిల్లీ-మీరట్ ఆర్ఆర్‌టీఎస్ కారిడార్
- ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది
- ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది

### నీళ్ల విషయంలో

# రాజకీయాలొద్దు

- వచ్చే రెండు, మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం
- దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి
- ప్రాజెక్టు పరిశీలన అనంతరం పనుల పురోగతిపై అధికారులతో సీఎం సమీక్ష
- గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుందని వ్యాఖ్య




ములుగు

గోదావరి జలాల వివాదం కొన్నాళ్లుగా రాజకీయరంగు పులుముకుం దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. గడిచిన పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తి చేసి ఉంటే ఇప్పుడు వివాదమే ఉండేది కాదని అభిప్రాయ పడ్డారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద దేవాదుల ప్రాజెక్టును పరిశీలించిన అనంతరం రేవంత్ రెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్?పై ఆయన పలు విమర్శలు గుప్పించారు. వచ్చే రెండు మూడేళ్లలో ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేయాలని కృత నిశ్చయంతో ఉన్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టు మీదే రూ.1.10 లక్షల కోట్లు ఖర్చు చేయడం వల్ల మిగతా వాటికి, భూ సేకరణకు తీవ్రంగా నిధుల కొరత ఉందని తెలిపారు. రూ.6వేల కోట్ల అంచనాతో మొదలుపెట్టిన దేవాదుల ప్రాజెక్టు ఇవాళ రూ.18 వేలకోట్ల నిధులు అవసరమైన స్థితికి

- మిగతా3లో

## తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు విజయ్ ఎక్కడ్నించి పోటీ చేయాలో చెబుతున్న కార్యకర్తలు

తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ, 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం తమ వ్యూహాలకు పదును పెడుతోంది. ఇందులో భాగంగా, పార్టీ అధ్యక్షుడు విజయ్ పెరంబూరు నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని కోరుతూ పార్టీ శ్రేణులు ఏకగ్రీవంగా తీర్మానం చేశాయి. ఉత్తర చెన్నైని రాబోయే రాజకీయ పోరుకు కేంద్రంగా మార్చాలన్న పార్టీ ఉద్దేశం దీని ద్వారా స్పష్టమవుతోంది. ఆదివారం చెన్నైలో జరిగిన పార్టీ సమావేశంలో టీవీకే ఎన్నికల ప్రచార నిర్వహణ కార్యదర్శి ఆదవ్ అర్జున ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. పెరంబూరు నుంచి విజయ్ పోటీ చేయాలన్నది కార్యకర్తలందరి ఏకగ్రీవ అభిప్రాయమని ఆయన తెలిపారు. ఈ తీర్మానానికి పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్. ఆనంద్ మద్దతు తెలిపారు. కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తామని, వారి ఆకాంక్షను దళపతి విజయ్‌కు తెలియజేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ డిమాండ్ వెనుక ఉన్న కారణాన్ని వివరిస్తూ ఆదవ్ అర్జున కీలక వ్యాఖ్యలు చేశారు. పేదరికం ఎక్కువగా, ప్రజల అవసరాలు అధికంగా ఉన్న నియోజకవర్గాల నుంచే పోటీ చేయాలన్నది తమ పార్టీ సిద్ధాంతమని, ఉత్తర చెన్నైలోని పరిస్థితులు దీనికి సరిగ్గా సరిపోతాయని అన్నారు. పెరంబూరు, కొళత్తూరు, లేదా ఆర్.కె. నగర్ వంటి ఉత్తర చెన్నై నియోజకవర్గాల నుంచి పోటీ చేసేందుకే విజయ్ కూడా మొగ్గు చూపుతున్నారని ఆయన వెల్లడించారు. ఇదే సమయంలో, అధికార డీఎంకేపై ఆదవ్ అర్జున విమర్శలు గుప్పించారు. చెన్నై డీఎంకేకు కంచుకోట అన్న వాదనను ఆయన తోసిపుచ్చారు. "ఇకపై చెన్నై టీవీకేదే" అని ప్రకటించి, ఆ అభిప్రాయాన్ని మార్చడానికే తాము రాజధాని నుంచి ప్రచారం ప్రారంభిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో డీఎంకే ఆధిపత్యం ఉందని చెబుతున్నా, స్థానిక బలమైన నేతలు ఇప్పుడు టీవీకే వైపు చూస్తున్నారని మంత్రి పి.కె. శేఖర్ బాబును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఈ పరిణామంతో, 2026 ఎన్నికల్లో చెన్నై కేంద్రంగా టీవీకే దూకుడుగా ప్రచారం చేయనుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి.

## ట్రంప్ మాస్టర్ ప్లాన్: ఖమేనీ, ఆయన కుమారుడిని అంతం చేసేలా వ్యూహం!

అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరింత తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. ఇరాన్ అణు కేంద్రాలపైనే కాకుండా, ఏకంగా ఆ దేశ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ, ఆయన వారసుడిగా భావిస్తున్న కుమారుడు మొజ్తాబా ఖమేనీలను లక్ష్యంగా చేసుకునే సైనిక ప్రణాళికలను అమెరికా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు ప్రముఖ వార్తా సంస్థ 'ఆక్సియోస్' ఒక కథనాన్ని ప్రచురించింది. ఇరాన్ తదుపరి పాలకుడిగా రేసులో ఉన్న మొజ్తాబా పేరు కూడా ఈ జాబితాలో ఉండటం ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇరాన్ విషయంలో అన్ని రకాల ప్రణాళికలతో సిద్ధంగా ఉన్నామని అమెరికా ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒకవేళ యుద్ధం అనివార్యమైతే ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని తొలగించేందుకు కూడా వెనుకాడబోమని ట్రంప్ సలహాదారు ఒకరు పేర్కొన్నారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత దాడులు చేసే ఆలోచనలో ఉన్నారా అన్న ప్రశ్నకు తాను దాని గురించి ఆలోచిస్తున్నానని అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా బదులిచ్చారు. చర్చలకు రావడానికి ఇరాన్‌కు 10-15 రోజులు సమయం ఇస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. అమెరికా హెచ్చరికలపై ఇరాన్ కూడా ఘాటుగానే స్పందించింది. తాము చర్చలకు సిద్ధంగా ఉన్నామని, అయితే దాడులు జరిగితే యుద్ధానికి కూడా వెనుకాడబోమని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరగ్చీ తేల్చి చెప్పారు. అమెరికా దాడులకు పాల్పడితే మధ్యప్రాచ్యంలోని వారి సైనిక స్థావరాలే తమ తదుపరి లక్ష్యాలని ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఇప్పటికే తెలియజేసింది.

ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా మధ్యప్రాచ్యంలో సైన్యాన్ని మోహరించింది. ఇప్పటికే రెండు అమెరికా విమాన వాహక నౌకలు ఇరాన్ తీరానికి సమీపంలో ఉన్నాయి. ఖతార్, బహ్రెయిన్ వంటి దేశాల నుంచి వేలాది మంది సైనికులను వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించింది. ఇరాన్ అగ్ర నాయకత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడం పూర్తిస్థాయి యుద్ధానికి దారితీయవచ్చని, ఇది వినాశకర పరిణామాలకు కారణమవుతుందని అంతర్జాతీయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## 'భారత ప్రతిభను ఇతర దేశాలకు ధారపోస్తున్నాం'

ఞుఎ్రాఛ్‌తీశీఞు శీఅ ×అఎఞుఅ ఞుశ్రీవత్ : ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడు సామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారాన్ని రేపుతున్నాయి. భారత్ ప్రపంచ దేశాలకు ప్రతిభను అందించే కేంద్రంగానే మిగిలిపోయిందని దుయ్యబట్టారు. సొంతంగా గ్లోబల్ టెక్నాలజీ ఉత్పత్తులను సృష్టించలేకపోయిందని విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై అధికార బీజేపీ తీవ్రస్థాయిలో స్పందించింది.
ఒక యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ పిట్రోడా భారత సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలపై కీలక వ్యాఖ్యలు చేశారు. 150 కోట్ల జనాభా కలిగిన దేశం ఇప్పటికీ విదేశీ సాంకేతికతపై ఆధారపడటం దురదృష్టకరమని అన్నారు. 'మనం భారీ స్థాయిలో యువ ప్రతిభను సృష్టించాం, కానీ అది ఇంకా 'ముడి' రూపంలోనే ఉంది. ఈ ప్రతిభ అంతా ప్రపంచవ్యాప్తంగా ఉన్న బహుళజాతి కంపెనీలకు ప్రోగ్రామింగ్, బ్యాంకింగ్, న్యాయ వ్యవస్థలు, తయారీ, లాజిస్టిక్స్ రంగాల్లో సేవ చేయడానికి ఉపయోగపడుతోంది. మనం మన సొంత ప్రతిభను ఇతరులకు సేవ చేయడానికి ధారపోస్తున్నాం' అని పేర్కొన్నారు. అంతేకాకుండా, పిట్రోడా మరికొన్ని ఘాటు వ్యాఖ్యలు చేశారు. భారత్ మైక్రోసాఫ్ట్ వంటి పెద్ద కంపెనీని గానీ, ప్రపంచ స్థాయి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ను గానీ సృష్టించల్లదని చెప్పుకొచ్చారు. కనీసం మొబైల్ ఫోన్ల కోసం ఒక ఆపరేటింగ్ సిస్టమ్‌ను కూడా తయారు చేయలేకపోయామన్నారు. ఇంత పెద్ద దేశానికి సొంత ఆపరేటింగ్ సిస్టమ్ లేకపోవడం నిజంగా సిగ్గుచేటని ఘాటుగా వ్యాఖ్యానించారు.

**పిట్రోడాకు బీజేపీ కౌంటర్**

పిట్రోడా చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. బీజేపీ జాతీయ ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియా వేదికగా పిట్రోడా వ్యాఖ్యలకు ఖండించారు. దేశంలో తయారైన పలు ఆపరేటింగ్ సిస్టమ్‌ల పేర్లను ఆయన ప్రస్తావించారు. 'ముందుగా వాస్తవాలు తెలుసుకోండి. భారత్ వద్ద లినక్స్, మాయ ఓఎస్, ప్రైమ్‌ఓఎస్, భార్‌ఓఎస్, ఇండస్ ఓఎస్, చీశ్రీఞుఙుఞుత్‌బఎ ూా వంటి స్వదేశీ ఆపరేటింగ్ సిస్టమ్స్ ఉన్నాయి. అబద్ధాలతో భారత్‌ను కించపరచడమే కాంగ్రెస్ పని' అని ఆయన మండిపడ్డారు. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ అయిన యూపీఐని భారత్ సృష్టించిందని, అది నేడు అనేక దేశాలకు ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. గ్లోబల్ టెక్నాలజీ రంగంలో భారత్ ఇప్పుడు 'నాయకత్వ' పాత్రకు చేరుకుందన్నారు. కరోనా కాలంలో భారత్ స్వదేశీ వ్యాక్సిన్లను తయారు చేసి ప్రపంచ దేశాలకు సరఫరా చేసిందని, రక్షణ రంగంలో కూడా 'మేక్ ఇన్ ఇండియా' వేగంగా పుంజుకుంటోందని చెప్పారు.

**వివాదాలకు కేరాఫ్ అడ్రస్ పిట్రోడా**

సామ్ పిట్రోడా వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఇదే మొదటిసారి కాదు. గత రెండు ఏళ్లలో ఆయబీన చేసిన పలు కామెంట్స్ కాంగ్రెస్ పార్టీని ఇరకాటంలో పడేశాయి. భారతదేశ వైవిధ్యాన్ని వివరిస్తూ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా నిరసనలకు దారితీశాయి. తూర్పు భారతీయులు చైనీయుల్లా, పశ్చిమ భారతీయులు అరబ్బుల్లా, ఉత్తరాది వారు తెల్లజాతి వారిలా, దక్షిణాది వారు ఆఫ్రికన్లలా కనిపిస్తారని ఆయన చేసిన కామెంట్స్ తీవ్ర దుమారాన్ని రేపాయి. దీనిపై ప్రధాని మోదీ స్వయంగా స్పందిస్తూ, ఇది దేశ ప్రజలను అవమానించడమేనని విమర్శించారు. ఫలితంగా పిట్రోడా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు. పాకిస్థాన్‌తో సంబంధాల విషయంలోనూ ఆయన అన్న మాటలు వివాదాస్పదంగా మారాయి. పొరుగు దేశాలతో, ముఖ్యంగా పాకిస్థాన్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవాలని పిట్రోడా సూచించారు. "నేను పాకిస్థాన్‌కు వెళ్లినప్పుడు నాకు సొంత ఇంట్లో ఉన్నట్లే అనిపించింది" అని ఆయన చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్రస్థాయిలో విమర్శించింది. అయోధ్య రామమందిర నిర్మాణం జరుగుతున్న సమయంలో 'రామమందిరం అసలైన సమస్యా? లేక నిరుద్యోగం, ద్రవ్యోల్బణమా?' అని ఆయన ప్రశ్నించారు. ఈ కామెంట్స్‌కు కాంగ్రెస్‌ను ఇరకాటంలో పెట్టాయి.

# డిజిటల్ మోసాల బారిన పడొద్దు

బ్యాంకు ఖాతాల పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండాలని దేశ ప్రజలకు ప్రధాని మోదీ సూచించారు. నో యువర్ కస్టమర్ (కేవైసీ)ని అప్‌డేట్ చేయమని, రీ-కేవైసీని చేయమని బ్యాంకు నుంచి వచ్చే రిక్వెస్టులను చూసి అస్సలు చిరాకు పడొద్దని ప్రజలను ఆయన కోరారు. సొంత డబ్బును కాపాడుకునేందుకే ఈ పనిని చేస్తున్నామనే విషయాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. ఆదివారం రోజు 131వ మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇప్పటికీ బ్యాంకు ఖాతా కేవైసీని చేశాం కదా, దీన్ని మళ్లీమళ్లీ ఎందుకు చేయాలనే ప్రశ్న చాలామంది మదిలో ఉదయిస్తుంటుందని ప్రధాని అన్నారు. మళ్లీమళ్లీ కేవైసీ ఎందుకంటే, బ్యాంకు ఖాతా భద్రత కోసమే అని అందరూ గ్రహించాలని ఆయన పిలుపునిచ్చారు. డిజిటల్ అరెస్ట్ లాంటి ఆన్‌లైన్ ఆర్థిక మోసాల బారినపడకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజలకు సూచించారు. ఈ కాలంలో పెన్షన్, రాయితీలు, బీమా, యూపీఐ సహా అన్నీ బ్యాంకు ఖాతాతోనే లింకై ఉన్నాయని మోదీ గుర్తు చేశారు. అందుకే ఖాతాలకు మెరుగైన భద్రతను కల్పించేందుకు రీ కేవైసీని బ్యాంకులు చేయిస్తాయన్నారు.



**కేవైసీ పేరుతో ఫేక్ కాల్స్, మెసేజ్‌లు రావొచ్చు**

"అయితే కేవైసీ, రీ కేవైసీ పేరుతో కొంతమంది నేరగాళ్ల నుంచి ఫేక్ కాల్స్ వచ్చే ప్రమాదం ఉంది. వాళ్లు ఎస్ఎంఎస్‌లు, వెబ్ సైట్ లింక్స్ పంపే ముప్పు కూడా ఉంది. అందుకే కేవైసీ, రీ కేవైసీని నేరుగా బ్యాంకు బ్రాంచీలో చేయించండి. లేదంటే బ్యాంకు అధికారిక యాప్ ద్వారా ఈ ప్రక్రియను పూర్తి చేయండి. ఎవరికీ మీ ఓటీపీని, ఆధార్ నంబరును, బ్యాంకు ఖాతా వివరాలను చెప్పకండి. మీ బ్యాంకు ఖాతా పాస్‌వర్డ్‌లను తరుచుగా మారుస్తుండండి. ఇలాంటి అంశాలపై దేశ ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇటీవలే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలను నిర్వహించింది. ఈ ఏడాది పొడవునా ఈ వారోత్సవాలు కొనసాగనున్నాయి. ఆర్‌బీఐ సూచనలను పాటించండి. మీ కేవైసీని అప్‌డేట్ చేసుకోండి" అని ప్రధాని మోదీ తెలిపారు.

**3 మేడిన్ ఇండియా ఏఐ మోడల్స్‌ను ఆవిష్కరించాం**

దిల్లీలో జరిగిన ఏఐ సదస్సు ద్వారా ఏఐ విభాగంలో భారత్ అద్భుత సామర్థ్యాలేంటో ప్రపంచానికి తెలిసొచ్చాయని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఏఐ సదస్సు వేళ మూడు మేడిన్ ఇండియా ఏఐ మోడల్స్‌ను భారత్ ఆవిష్కరించిందని ఆయన తెలిపారు.
ఈ జాబితాలో సర్వం ఏఐకు చెందిన లార్జ్ ల్యాంగ్వేజ్ మోడల్, జ్ఞాని.ఏఐకు చెందిన వచన టెక్ట్స్ టు స్పీచ్ మోడల్, భారత్ జెన్స్‌కు చెందిన పరం2 17బీ బహుభాషా ఫౌండేషనల్ మోడల్ ఉన్నాయని చెప్పారు. వివిధ ప్రపంచ దేశాల నేతలు, పరిశ్రమ నిపుణులు, ఆవిష్కర్తలు, స్టార్టప్‌ల ప్రతినిధులను ఏఐ సదస్సు వేదికపైకి తేవడంలో భారత్ సక్సెస్ అయిందని ప్రధాని అన్నారు. ఆ సదస్సు సందర్భంగా పలువురు ప్రపంచ దేశాల నేతలు, టెక్ దిగ్గజ కంపెనీల సీఈఓలతో తాను కూడా భేటీ అయ్యానని ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఏఐ శక్తిని ప్రపంచం ఎలా వినియోగిస్తుందనే దిశగా జరుగుతున్న కసరత్తులో ఈ ఏఐ సదస్సు ఒక టర్నింగ్ పాయింట్ లాంటిదన్నారు.

**ఆ రెండు ఆవిష్కరణలు ప్రపంచ నేతలకు నచ్చాయ్**

"భారత్ నిర్వహించిన ఏఐ సదస్సుకు చాలామంది ప్రపంచదేశాల నేతలు వచ్చారు. ఈ సదస్సు సందర్భంగా ప్రదర్శించిన భారతీయ ఏఐ ఆవిష్కరణలను నేను వాళ్లకు చూపించాను. ప్రపంచ దేశాల నేతలకు ప్రత్యేకించి రెండు ఆవిష్కరణలు బాగా నచ్చాయి. వీటిలో మొదటిది అమూల్ బూత్. ఇందులో పశువుల నిర్వహణతో ముడిపడిన ఏఐ యాప్‌లను ప్రదర్శించారు. సకాలంలో పశువులకు చికిత్సను అందించేందుకు ఏఐ టెక్నాలజీని ఎలా వినియోగించాలి అనేది అమూల్ బూత్‌లో వివరించారు. పాల డైరీ కార్యకలాపాలను, పశువులను ఎప్పటికప్పుడు సమర్థంగా ట్రాక్ చేసేందుకు పాడి రైతులకు ఏఐ వ్యవస్థలు ఎలా ఉపయోగపడతాయి అనే సమాచారాన్ని ఆ బూత్‌లో తెలియజేశారు" అని ప్రధాని మోదీ వివరించారు.

**ఏఐ టెక్నాలజీతో పురాణాలు, ఇతిహాసాల పరిరక్షణ**

"ఇక ప్రపంచ దేశాల నేతలకు నచ్చిన రెండో ఆవిష్కరణ భారత సంస్కృతి పరిరక్షణతో ముడిపడినది. ఏఐ టెక్నాలజీతో అత్యంత ప్రాచీన సుశ్రుత సంహిత గ్రంథానికి చెందిన తాళపత్రాల ఫొటోలను హైక్వాలిటీలో చూపించారు. తాళపత్రాలనూ చాలా ఈజీగా చదివే ఏర్పాటును ఏఐ టెక్నాలజీ చేసింది. సుశ్రుత సంహిత తాళపత్రాల ఫొటోలను మెషీన్ రీడబుల్ ఫార్మాట్‌లోకి మార్చారు. ఒక ఏఐ అవతార్‌ను క్రియేట్ చేసి, దాని ద్వారా తాళపత్రాలలోని ప్రాచీన లిపిని భారతీయ భాషల్లోకి, విదేశీ భాషల్లోకి అనువదించారు. ఇదంతా చూసి ప్రపంచ దేశాల నేతలు ఆశ్చర్యపోయారు. ఏఐ టెక్నాలజీ చలువతో భారతదేశ ప్రాచీన విజ్ఞానాన్ని నేర్చుకునే అవకాశం తమకూ లభిస్తుందని వాళ్లు చెప్పారు. ఏఐ టెక్నాలజీతో మనం ప్రాచీన పురాణాలు, ఇతిహాసాలు, సంప్రదాయ విజ్ఞానం, తాళపత్ర గ్రంథాలు, చేతిరాత ప్రతులను పరిరక్షించొచ్చు. ఈతరం ప్రజలు చదివేందుకు అనుగుణంగా వాటిని మార్చొచ్చు' ప్రధాని మోదీ తెలిపారు.

**జయలలిత ప్రజల గుండెల్లో నిలిచిపోతారు**

"ఫిబ్రవరి 24న తమిళనాడు మాజీ సీఎం జయలలిత జయంతి జరగబోతోంది. ఆమెకు ఈసందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను. అమ్మ జయలలిత తమిళనాడు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారు. కేరళకు చెందిన మామాంగం సంప్రదాయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. 250 ఏళ్ల తర్వాత మళ్లీ ఆ సంప్రదాయం కేరళలో జీవం పోసుకుంది. ఇది హర్షించే విషయం" అని ప్రధాని మోదీ చెప్పారు.

**ఆ టీ20 టీమ్‌లలో భారత సంతతి ప్లేయర్లే ఎక్కువ**

"అమెరికా, కెనడా, ఒమన్ సహా ఎన్నో దేశాల్లో భారత సంతతి క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. టీ2 వరల్డ్ కప్‌లో ఈవిషయం స్పష్టంగా కనిపించింది. కెనడా క్రికెట్ టీమ్‌లో ఎక్కువ మంది భారత సంతతి ప్లేయర్లే ఉన్నారు. ఆ టీమ్ కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా పంజాబ్‌లోని గురుదాస్‌పూర్‌లోనే జన్మించారు. కెనడా టీమ్‌లోని నవనీత్ ధలివాల్ మన చండీగఢ్‌లోనే జన్మించారు. ఈ జాబితాలో హర్ష్ థాకెర్, శ్రేయాస్ మొవ్వ వంటి ప్లేయర్ల పేర్లు కూడా ఉన్నాయి. వీళ్లంతా కెనడా, భారత్‌లకు గర్వకారణంగా నిలుస్తున్నారు. అమెరికా టీమ్‌లో మోనాంక్ పటేల్, సౌరభ్ రంజనె, హర్మీత్ సింగ్, మిలింద్ కుమార్, ఒమన్ టీమ్‌లో జతీందర్ సింగ్, వినాయక్ శుక్లా, కరణ్ సోనావాలే, జై ఒదెద్రా, ఆశిష్ ఒదెద్రా అనే భారత సంతతి ప్లేయర్లు ఉన్నారు. న్యూజిలాండ్, యూఏఈ, ఇటలీ టీమ్‌లలోనూ భారత సంతతి ప్లేయర్లు ఉన్నారు. భారతీయులు ఎక్కడున్నా, భారత గడ్డతో అనుసంధానమై ఉంటారు. తాము పనిచేసే చోట అద్భుతంగా రాణిస్తారు.సూపర్ 8కు అమెరికా, కెనడా, ఒమన్ టీమ్‌లు క్వాలిఫై కానప్పటికీ, పెద్ద టీమ్‌లకు గట్టిపోటీని ఇచ్చాయి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# కాంగ్రెస్ 'నగ్న' రాజకీయాలు చేయాల్సిన పనేంటి?

**లక్నో:** ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కాంగ్రెస్ నగ్న రాజకీయాలపై ప్రధాని మోదీ విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ఇప్పటికే నగ్నంగా ఉందనే విషయం? దేశ ప్రజలకు తెలుసు. మరీ దుస్తులు తీసివేయాల్సిన అవసరం ఏముంది? అని ప్రశ్నించారు. ఆదివారం ప్రధాని మోదీ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం మీరట్‌లో పర్యటిస్తున్నారు. పర్యటనలో 82 కిలోమీటర్ల పొడవైన ఢిల్లీ-ఘజియాబాద్-మీరట్ మేట్రో సేవల్ని ప్రారంభించారు. అనంతరం, ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఢిల్లీలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరిగింది. ఆ సమ్మిట్‌లో భారత్-ఆమెరికా వాణిజ్య ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ భారత యువజన కాంగ్రెస్ కార్యకర్తలు (ఐవైసీ) చొక్కాలు విప్పి ఆందోళన చేపట్టారు. దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో సేవలు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో ప్రారంభమయ్యాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం ఈ సర్వీసులను లాంఛనంగా ప్రారంభించి జాతికి అంకితం చేశారు. అనంతరం శతాబ్ది నగర్ స్టేషన్ నుంచి మీరట్ సౌత్ స్టేషన్ వరకు ఉత్తరప్రదేశ్



ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో కలిసి మెట్రోలో ప్రయాణించారు. ఈ మెట్రో గంటకు గరిష్ఠంగా 120 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఈ మీరట్ మెట్రో దేశంలోనే అతి వేగవంతమైన మెట్రో వ్యవస్థగా నిలిచింది. మీరట్ మెట్రో సేవలు ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆధునిక రవాణా వ్యవస్థతో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గి ప్రజలకు సౌకర్యం కలుగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నమో భారత్ రైలు సేవలను కూడా ప్రధాని ప్రారంభించారు. ఢిల్లీ-మీరట్ మధ్య రీజనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఆర్‌ఆర్‌టీఎస్) కారిడార్‌పైనే మీరట్ మెట్రో కూడా నడవడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత. దేశంలో ఒకే మౌలిక వసతులపై రెండు వేర్వేరు రైలు సేవలు నడవడం ఇదే తొలిసారి. నమో భారత్ రైలు సాధారణంగా గంటకు 160 కి.మీ., గరిష్ఠంగా 180 కి.మీ. వేగంతో ప్రయాణిస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ దేశవ్యాప్తంగా రూ.12,390 కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ఆవిష్కరించారు. 82 కిలోమీటర్ల ఢిల్లీ-మీరట్ నమో భారత్ ఆర్‌ఆర్‌టీఎస్ కారిడార్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభించారు. దీంతో ఢిల్లీ, మీరట్ మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గనుంది.

# తమిళనాడులో భారీ ఉగ్ర కుట్ర భగ్నం

దేశంలో భారీ ఉగ్రదాడులకు ప్లాన్ చేస్తున్న ముఠాను దిల్లీ పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం ఎనిమిది మంది పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి పాకిస్థాన్ గూఢచర్య సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ), బంగ్లాదేశ్‌కు చెందిన తీవ్రవాద సంస్థలతో సంబంధాలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. తదుపరి దర్యాప్తు కోసం వారిని దిల్లీకి తరలిస్తున్నారు. ఇటీవల దిల్లీ మెట్రో సహా దేశ రాజధానిలో పలు ప్రాంతాల్లో ప్రజలను రెచ్చగొట్టే విధంగా పోస్టర్లు అంతికించారు. ఆ పోస్టర్లలో కశ్మీర్‌కు సంబంధించిన ఉద్రిక్త అంశాలు ఉండటంతో భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. ఆ పోస్టర్ల గురించి తెలుసుకునేందురు దర్యాప్తు చేపట్టిన స్పెషల్ సెల్ తమిళనాడులో కార్యకలాపాలు సాగిస్తున్న ఈ నెట్‌వర్క్‌ను గుర్తించారు. ఆరుగురు వ్యక్తులు తిరుప్పూర్?లోని వస్త్ర కర్మాగారాల్లో పని చేస్తున్నారని, నకిలీ ఆధార్? కార్డును కలిగి ఉన్నారని దర్యాప్తు అధికారులు కనుగొన్నారు. తిరుప్పూర్?కు చేరిన స్పెషల్ సెల్?, స్థానిక పోలీసుల సాయంతో ఆరుగురిని ఆరెస్ట్ చేశారు.

**బంగాల్‌లోనూ మరో ఇద్దరు అరెస్ట్**

తిరుప్పూర్‌లోని ఉతుకులి నుంచి ఇద్దరు, పల్లడం నుంచి ముగ్గురు, తిరుమురుగన్‌పూండి ప్రాంతం నుంచి ఒకరు అరెస్టయ్యారు. వారు మిజానూర్ రెహమాన్, మహ్మద్ షబత్, ఉమర్, మహ్మద్ లితాన్, మహ్మద్ షాహిద్, మహ్మద్ ఉజ్జల్‌గా గుర్తించారు. అలాగే బంగాల్? నుంచి మరో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. అరెస్టైన వారిలో కొందరు బంగ్లాదేశ్ పౌరులని, వారు తమ అసలు గుర్తింపును దాచేందుకు నకిలీ ఆధార్ కార్డులు వినియోగించినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన వారిని తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల కోసం రైలులో దిల్లీకి తరలిస్తున్నట్లు అధికారులు తెలిపారు.



**మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డుల స్వాధీనం**

విదేశీ హ్యాండ్లర్ల ఆదేశాల మేరకు భారత్‌లో పెద్ద ఎత్తున ఉగ్రదాడి చేయాలని వీరు ప్రణాళిక రచించినట్లు దర్యాప్తు అధికారులు తెలిపారు. వారితో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు చెప్పారు. ఇక ఆపరేషన్ సమయంలో ఎనిమిది మొబైల్ ఫోన్లు, 16 సిమ్ కార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డిజిటల్ ఆధారాలు, ఇతర వ్యక్తులతో ఉన్న సంబంధాలపై దర్యాప్తు కొనసాగుతోంది. బంగ్లాదేశ్‌కు చెందిన తంజీమ్ సంస్థలతో వీరి సంబంధాలపై మరింత విచారణ చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఉగ్రముఠాతో సంబంధం ఉన్న మరికొందరి కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

**ఏఐ సమ్మిట్ సందర్భంగా కశ్మీర్ పోస్టర్లు**

ఈ ఎనిమిది మంది సోషల్ మీడియా ద్వారా పరస్పరం సంప్రదింపులు కొనసాగించిటన్లు పోలీసులు తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన ఉగ్ర సంస్థలకు మద్దతుగా పోస్టులు పెట్టినట్లు గుర్తించినట్లు చెప్పారు. ఈ ఎనిమిది మందిలో నలుగురు ఇటీవల జరిగిన ఏఐ సమ్మిట్ సందర్భంగా దిల్లీకి వచ్చి 'ఫ్రీ కశ్మీర్' వంటి ప్రేరేపణాత్మక పోస్టర్లు మెట్రో స్టేషన్‌లో అతికించినట్లు పోలీసుల తెలిపారు. ఆ తర్వాత తిరిగి తమిళనాడు, బంగాల్?కు వెళ్లినట్లు వెల్లడించారు.

**ఉగ్రముప్పు హెచ్చరికతో దిల్లీలో హైఅలర్ట్**

దేశ రాజధాని దిల్లీలో ఉగ్ర దాడులు జరిగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించడంతో శనివారం దిల్లీ హైఅలర్ట్ ప్రకటించారు. దిల్లీలోని ఎర్రకోట, చాందీని చౌక్?, ప్రముఖ ఆధ్యాత్మిక ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని దాడులకు కుట్ర పన్నినట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. అందుకోసం భారత మొత్తంలో పేలుడు పదార్థాలను వినియోగించే అవకాశముందని తెలిపాయి. దీంతో అప్రమత్తమైన భద్రతా సంస్థలు దిల్లీలో హైలర్ట్ ప్రకటించి, బాంబ్? స్క్వాడ్?తో బృందాలు రంగంలోకి దిగాయి. దేవాలయాలు, రద్దీగా ఉండే ప్రదేశాల్లో అదనపు సిబ్బందిని మోహరించాయి. ఫిబ్రవరి 6న పాకిస్థాన్‌లోని ఇస్లామాబాద్‌లో మసీదు పేలుడు ఘటనకు ప్రతీకారంగా భారత్‌లో భారీ ఉగ్రదాడి చేయాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం.

ప్రతిఘటన
సోమవారం 23 ఫిబ్రవరి 2026

# ఆ ఒక్కరూ ఎవ్వరు...

**హైదరాబాద్ :** తెలంగాణలో ఖాళీ అవుతున్న రెండు రాజ్యసభ స్థానాలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నెల 26న నోటిఫికేషన్ విడుదల కానుండగా, మార్చి 16న పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం కాంగ్రెస్ తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అభిషేక్ మను సింఘ్వీతో పాటు, బిఆర్ఎస్ సభ్యుడు కె.ఆర్. సురేష్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. దీంతో కాంగ్రెస్ పార్టీలో ఈ రెండు స్థానాల కోసం పోటీ ప్రారంభమయింది. ఇప్పటి వరకూ సీనియర్ నేతలను పట్టించుకోలేదని, ఈసారైనా పార్టీ విధేయులకు రాజ్యసభర స్థానాలను ఇవ్వాలన్న డిమాండ్ ఎక్కువగా వినపడుతుంది. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పార్టీకోసం కష్టపడిన వారికి ఇప్పటి వరకూ ఛాన్స్ ఇవ్వకపోవడాన్ని తప్పు పడుతుంది. శాసనసభలో ప్రస్తుత పార్టీల బలాబలాలను పరిశీలిస్తే, అధికార కాంగ్రెస్ పార్టీ ఈ రెండు స్థానాలను సునాయాసంగా కైవసం చేసుకునేలా కనిపిస్తోంది. రాజ్యసభ ఎన్నికల గెలుపు లెక్కల ప్రకారం, రెండు స్థానాలు ఖాళీగా ఉన్నప్పుడు ఒక్కో అభ్యర్థి గెలవడానికి దాదాపు 40 నుంచి 41 మొదటి ప్రాధాన్యత ఓట్లు అవసరం. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు ఉన్న 64 మంది స్వంత ఎమ్మెల్యేలతో పాటు, ఇతర పార్టీల నుండి చేరిన వారితో కలిపి మొత్తం బలం 75 దాటడంతో, ఇద్దరు అభ్యర్థులను గెలిపించుకోవడానికి అవసరమైన 82 ఓట్లకు కాంగ్రెస్ అత్యంత సమీపంలో ఉంది. మజ్లిస్ మద్దతు ఎటూ కాంగ్రెస్ పార్టీకే లభిస్తుంది. అందుకే రెండు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందిప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పరిస్థితి ఈ ఎన్నికల్లో కొంత ఇబ్బందికరంగానే ఉంది. ఆ పార్టీకి ప్రస్తుతం ఉన్న 27 మంది ఎమ్మెల్యేల సంఖ్యాబలం ఒక సీటు గెలవడానికి కూడా సరిపోదు. ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న బీజేపీ ఓటింగ్ కు హాజరు కాకపోవచ్చు. పైగా, రెండో ప్రాధాన్యత ఓట్ల విషయంలోనూ అధికార పక్షానికే స్పష్టమైన ఆధిక్యం ఉండటంతో బీఆర్ఎస్ అభ్యర్థిని నిలబెట్టినా పోటీ ఇవ్వడం కష్టమే. కాంగ్రెస్ అధిష్టానం ఒక సీటును జాతీయ స్థాయి నేతకు, మరో సీటును సామాజిక సమీకరణాల దృష్ట్యా రాష్ట్ర స్థాయి నేతకు కేటాయించే అవకాశం ఉంది. అయితే ఆ ఒక్క సీటు ఎవరికి అన్నది ఇంకా తేలలేదు. జగ్గారెడ్డి మాత్రం వీహెచ్ కు, కుసుమ కుమార్ లకు ఇవ్వాలంటూ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. అయితే పార్టీ భవిష్యత్ ప్రయోజనాలు, రాజకీయ సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని అంటున్నారు. మరి ఆ ఒక్కరు ఎవరో?



# నక్షత్రాలు, చల్లని గాలులను ఆస్వాదిస్తూ..

ఇంట్లో కూర్చుని స్మార్ట్‌ఫోన్‌లో లేదా టీవీలో ఓటీటీ చూడటం ఈ రోజుల్లో సర్వసాధారణమైపోయింది. అయితే చల్లటి గాలుల నడుమ మిణుకుమిణుకుమంటూ మెరిసే నక్షత్రాలు, ఆహ్లాదకరవాతావరణంలో ఫ్రెండ్స్?తో కలిసి సినిమా చూస్తుంటే అది జీవితంలో అది మరపురాని అనుభూతి. సరిగ్గా ఇలాంటి మూవీ థియేటర్ ట్రెండింగ్ ప్రస్తుతం హైదరాబాద్? నగరంలో వేగంగా పుంజుకుంటోంది. వీకెండ్స్?లో, సెలవురోజుల్లో ఈ విధంగా సినిమా చూసేందుకు, బంధుమిత్రులతో గడిపేందుకు నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. అసలేంటీ వీటి ప్రత్యేకతలు? ప్రజల నుంచి వీటికి ఆదరణ ఎలా ఉంది తదితర విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

కొత్త వాతావరణంలో గడపాలనుకునేవారికి

ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి నిద్రించే వరకు ఉరుకుల పరుగుల జీవితంలో అలా కాసేపు కొత్త వాతావరణంలో సేదదీరాలనుకునేవారు ఎక్కువగా ఓపెన్? మూవీ థియేటర్లకు హాజరవుతున్నారు. 30 నుంచి 300 మంది కూర్చోగలిగే సామర్థమున్న హోటళ్లు, పార్కుల్లో బహిరంగ ప్రదేశాల్లో సౌకర్యవంతమైన సీటింగ్, ఆహార పానియాలను అందిస్తున్నారు. బాలీవుడ్, హాలీవుడ్, టాలీవుడ్ చిత్రాల నుంచి క్లాసిక్, రొమాంటిక్ సినిమాలను ప్రదర్శిస్తున్నారు.

హైదరాబాద్?లో ఇప్పుడు ఇదే ట్రెండ్ : సినిమా చూస్తున్నప్పుడు అకస్మాత్తుగా వర్షం పడితే ముందుగా విధించుకున్న షరతుల ప్రకారం వాయిదా వేస్తారు. తరవాత ఏం చేయాలనేది నిర్ణయిస్తారు. ఇంట్లో వివాహ శుభకార్యం, ఆఫీసులో గెట్-టు గెదర్‌కు ఆరుబయట సినిమాను ప్రదర్శించాలనుకుంటే తగిన రుసుము తీసుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్ సిటీ, గచ్చిబౌలి ప్రాంతాల్లో శని, ఆదివారాల్లో ప్రదర్శనలు నిర్వహిస్తూ ఐటీ ఉద్యోగులను ఆకట్టుకుంటున్నారు. ఇటీవల కాలంలో వీటికి ఆదరణ పెరుగుతోంది.

ప్రైవేటు స్క్రీనింగ్ సైతం : బర్త్?డే కార్యక్రమం, వివాహ వేడుకలు ఉంటే ప్రైవేటు స్క్రీనింగ్?లకు అవకాశాన్ని కల్పిస్తున్నారు. కనీసం 30-50 మంది చూపరులు ఉంటేనే అనుమతిస్తున్నారు. ఆయా నిర్వాహక సంస్థల వెబ్?సైట్?లో వివరాలను నమోదు చేస్తే వారే ఏర్పాట్లు చేస్తారు. ఇటీవల కాలంలో కొన్ని సంస్థలు తమ ఉద్యోగులకు ఇలాంటి ఎక్స్?పీరియన్స్?ను అందించేందుకు ప్రైవేటు స్క్రీనింగ్?లను బుక్?చేస్తున్నట్లుగా నిర్వాహకులు చెబుతున్నారు. హైదరాబాద్? నగరంలో వీటికి ప్రస్తుతం మంచి ఆదరణ లభిస్తోంది.

"ఆరుబయట సినిమా ప్రదర్శనకు వీకెండ్స్?లో ఉద్యోగులు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పటి వరకు కాపీషాపులు, పార్కులు లాంటి ప్రదేశాల్లో ఏర్పాటు చేస్తున్నాం. ఒక వేల ఇంటివద్దకే కావాలంటే దానికి ప్రత్యేకమైన ధరతో అందుబాటులో ఉంచుతున్నాం"- పి.విష్ణు, ఓ సంస్థ నిర్వాహకులు

**ఇవీ ప్రయోజనాలు :**

వీకెండ్స్?లో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సినిమా చూసే అవకాశం.

ప్రకృతి ఒడిలో, చల్లని గాలుల మధ్య సినిమా చూసే భిన్నమైన అనుభూతి

పాత రోజుల నాటి అనుభూతిని కలిగిస్తుంది.

ప్రశాంతమైన వాతావరణంలో సినిమా వీక్షించే సౌలభ్యం

కొన్ని చోట్ల ప్రైవేటు స్క్రీనింగ్? సైతం అందుబాటులోకి

పెళ్లి, ఇతర ప్రత్యేక సందర్భాల్లో ఇంటి వద్దనే ఓపెన్?మూవీ థియేటర్ ఏర్పాటు చేసే అవకాశం

అనుబంధాలను పెంపొందిస్తుంది

షరతులు వర్తిస్తాయ్ : అయితే ప్రైవేటు స్రీనింగ్ విషయంలో కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డును తమ వెంట తీసుకువెళ్లాల్సి ఉంటుంది. వేదిక వద్ద నిబంధనలు పాటించాలి. ఆలస్యంగా వచ్చినట్లయితే లోనికి ప్రవేశం ఉండదు. హెల్మెట్లు, లేజర్?, మారణాయుధాలు, సంగీత వాయిద్యాలు లాంటి వాటిని తమ వెంట తీసుకువెళ్లరాదు. ఏ కార్యక్రమమైనా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది.



# కాంగ్రెస్ అగ్నిపరీక్ష గా ఐదు రాష్ట్రాల ఎన్నికలు

పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికలు వచ్చే మా?డు నెలల్లో జరగనున్నాయి. చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని అనుకున్న రాష్ట్రాల్లో కూడా ఓడిపోతోంది. రాను రాను ఆ పార్టీ పరిస్థితి దిగజారుతోంది. ఇలాంటి సమయంలో మరో ఐదు రాష్ట్రాల ఎన్నికలు వచ్చాయి. ఈ ఐదు రాష్ట్రాల్లో ముఖాముఖి, కూటములుగా తలపడే పరిస్థితులు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ వరుస ఓటములతో సతమతమవుతున్న వేళ, ఈ ఎన్నికలు ఆ పార్టీ ఉనికికి ,ప్రతిపక్ష కూట ఐక్యతకు అగ్నిపరీక్షగా మారాయి. పశ్చిమ బెంగాల్‌లో మరోసారి తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ మధ్య ముఖాముఖి పోరు నెలకొంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ తన సంక్షేమ పథకాలు , బెంగాలీ అస్తిత్వంపై నమ్మకం పెట్టుకోగా, ప్రభుత్వ వ్యతిరేకత, అవినీతి ఆరోపణలను బీజేపీ తన ప్రధాన అస్త్రాలుగా మార్చుకుంది. ఇక్కడ కాంగ్రెస్, వామపక్షాలతో కలిసి పోటీ చేస్తున్నప్పటికీ, ప్రధాన పోటీ మాత్రం టీఎంసీ-బీజేపీ మధ్యే ఉండేలా కనిపిస్తోంది. ముస్లిం ఓట్ల సమీకరణ ఇక్కడ గెలుపోటములను శాసించనుంది. మమతా బెనర్జీ ఎంతో నమ్మకంగా ఉన్నప్పటికీ.. బీజేపీ కూడా గెలిచి చూపిస్తామన్న ధీమాతో ఉంది. తమిళనాడులో అధికార డీఎంకే కూటమి బలంగా ఉన్నప్పటికీ, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం రాకతో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. అన్నా డీఎంకే తన కోల్పోయిన వైభవాన్ని చాటుకోవాలని చూస్తుంటే, బీజేపీ తన ఓటు బ్యాంకును పెంచుకోవడానికి తీవ్రంగా శ్రమిస్తోంది. కాంగ్రెస్ ఇక్కడ డీఎంకేపైనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది. సీట్ల సర్దుబాటు విషయంలో డీఎంకే ఈసారి కఠినంగా వ్యవహరించే అవకాశం ఉండటంతో కాంగ్రెస్‌కు ఇది సవాలుగా మారింది. త్రిముఖ పోరులో డీఎంకేకు లాభం కలుగుతుందన్న అంచనాలు వస్తున్నాయి. సాధారణంగా కేరళలో ఐదేళ్లకోసారి ప్రభుత్వం మారుతుంది, కానీ గత ఎన్నికల్లో పినరయి విజయన్ ఆ సంప్రదాయాన్ని బ్రేక్ చేశారు. ఇప్పుడు వరుసగా మూడోసారి అధికారం దక్కించుకోవాలని ఎల్‌డిఎఫ్ చూస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్ కి ఇది చావో రేవో లాంటి ఎన్నిక. ఒకవేళ ఇక్కడ కూడా కాంగ్రెస్ ఓడిపోతే, జాతీయ స్థాయిలో ఆ పార్టీ నైతిక స్థైర్యం పూర్తిగా దెబ్బతింటుంది. అటు బీజేపీ కూడా క్రైస్తవ ఓటర్లను ఆకట్టుకుంటూ ఇక్కడ బలపడాలని చూస్తోంది. ప్రియాంకా గాంధీ వాయనాడ్ నుంచి ఎంపీగా ఉండటంతో గెలుపు సాధించడం ప్రతిష్టాత్మకంగా మారింది. అసోంలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తిరుగులేని నాయకుడిగా ఎదిగారు. అభివృద్ధి , హిందుత్వ నినాదాలతో బీజేపీ మూడోసారి అధికారంపై కన్నేసింది. కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అంతర్గత కుమ్ములాటలతో ఇబ్బంది పడుతోంది. పైగా కీలక నేతలు బీజేపీలో చేరడం ఆ పార్టీకి పెద్ద దెబ్బ. ఏఐయుడిఎఫ్ వంటి పార్టీలతో పొత్తులు కుదిరితేనే కాంగ్రెస్ ఇక్కడ గట్టి పోటీ ఇచ్చే అవకాశం ఉంది, లేదంటే బీజేపీకి మార్గం సుగమం అవుతుంది.పుదుచ్చేరిలో ఎన్. రంగస్వామి నేతృత్వంలోని ఏఐఎన్ఆర్సీ , బీజేపీ కూటమి అధికారాన్ని నిలబెట్టుకోవాలని చూస్తోంది. గతంలో ఇక్కడ కాంగ్రెస్ బలంగా ఉండేది, కానీ నేతల వలసలు ఆ పార్టీని బలహీనపరిచాయి. ఇక్కడ కూడా డీఎంకే మద్దతుతోనే కాంగ్రెస్ తన ఉనికిని చాటుకోవాల్సిన పరిస్థితి ఉంది. చిన్న రాష్ట్రం అయినప్పటికీ, ఇక్కడ గెలుపు కేంద్రంలోని అధికార పార్టీకి ప్రతిష్టాత్మకం.ఈ ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి అత్యంత కీలకం. కేరళలో అధికారం దక్కించుకోలేకపోతే, ఆ పార్టీ కేవలం కొన్ని చిన్న రాష్ట్రాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. మరోవైపు, బెంగాల్ , తమిళనాడులో ప్రాంతీయ పార్టీలైన టీఎంసీ, డీఎంకేలు గెలిస్తే, ఇండియా కూటమిలో కాంగ్రెస్ ప్రాధాన్యత తగ్గి, మమతా బెనర్జీ , స్టాలిన్ వంటి నేతలు జాతీయ నాయకత్వం వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందు ఈ ఐదు రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయ గమనాన్ని మార్చనున్నాయి.

## నీళ్ల విషయంలో రాజకీయాలొద్దు

-మొదటిపేజీ తరువాయి

చేరుకుందన్నారు. అన్ని ప్రాజెక్టులపై సమీక్ష చేసి పూర్తి చేయాలని నిర్ణయించామని తెలిపారు. ప్రాజెక్టులు పూర్తి చేసుకుని రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకోవాలన్నారు. మేడిగడ్డ కుంగిన తర్వాత అక్కడి నుంచి నీరు ఎత్తిపోయలేదని రేవంత్ రెడ్డి అన్నారు. కాళేశ్వరం నిరుపయోగమైనా అత్యధికంగా వరి దిగుబడి వస్తోందని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో, తర్వాత తెలంగాణలో ఏం జరిగిందో చర్చించామని చెప్పారు. కేసీఆర్, హరీశ్‌రావు తప్పులు చేశారని ప్రజలు గ్రహించారని, తీర్పు ఇచ్చారని రేవంత్ రెడ్డి వివరించారు. పదేళ్లు వాళ్లేం చేశారో ఈ ప్రభుత్వం ఏ చేసిందో సభలో చర్చిస్తామన్నారు. ప్రతిపక్షం వారు సూచనలు చేస్తే మేం స్వీకరిస్తామన్న రేవంత్ రెడ్డి జలాల విషయంలో ఏపీకి సహకరిస్తున్నామనేది పూర్తిగా అసంబద్ధమని తెలిపారు. ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దామని ప్రజలు, నీళ్ల విషయంలో కాదని ఆయన హితవు పలికారు. పలు ఎన్నికల్లో తీర్పు చూసిన తర్వాతైనా బీఆర్ఎస్ నేతలు మారకపోవటం విచారకరమన్నారు. ఆ పార్టీని మళ్లీ గెలిపించకపోవడం ప్రజల తప్పునట్లుగా వారు వ్యవహరిస్తున్నారన్నారు. ఓటు వేసిన ప్రజలను బహిష్కరించినట్లు చేయటం సరికాదని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజలను తప్పుపట్టడం మానేసి విజ్ఞతగా వ్యవహరించాలని హితవు పలికారు.

"గోదావరి నదీ జలాలలకు సంబంధించిన ప్రాజెక్టులను మనం ఈ పదేళ్లలో పూర్తి చేసుకుని 967 టీఎంసీలను వినియోగం లోకి తెచ్చుకుని ఉంటే ఈనాడు వరద జాలల విషయంలో కూడా వాటాలు అడిగే పరిస్థితి ఉండేది. కాళేశ్వరం ప్రాజెక్టుకే అధిక నిధులు కేటాయించడం వల్ల మిగిలిన వాటికి నిధులు ఇవ్వడానికి వెతుక్కునే పరిస్థితి వచ్చింది. రాబోవు రెండేళ్లలో ఈ ప్రాజెక్టులన్నింటిని పూర్తి చేయాలని చిత్తశుద్ధితో ఇక్కడకు వచ్చాం. అన్ని ప్రాజెక్టులపై పూర్తిస్థాయిలో సమీక్ష చేసి పూర్తిచేసేందుకు ప్రయత్నిస్తాం"- రేవంత్ రెడ్డి, ముఖ్యమంత్రి ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకుంటాం : సీఎం కుర్చీ అనేది ప్రతిసారి వారసత్వంగా దక్కదని రేవంత్ రెడ్డి అన్నారు. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు వరుసగా రెండుసార్లు చొప్పున ప్రజలు అవకాశం ఇచ్చారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజలు మరో అవకాశం ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులను గాలికి వదిలేయమని పేర్కొన్నారు. ప్రజల సొమ్ముతో కట్టిన ప్రాజెక్టులను వృథాగా వదిలేసేది లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నిపుణుల సూచన ప్రకారం మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తామని వెల్లడించారు. విపక్షం అసెంబ్లీకి వచ్చి గోదావరి జలాలపై సూచనలు చేస్తే స్వీకరిస్తామని చెప్పారు. ఏపీతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే దిశలో ఉన్నామని వెల్లడించారు.

## ప్రజల ఆస్తులపై రేవంత్ కన్నుపడింది

హైదరాబాద్: మూసీ బాధితులకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. ఆదివారం ఆయన మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ వల్ల నష్టపోతున్న బాపు ఘాట్ మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులపై రేవంత్ కన్నుపడిందని మండిపడ్డారు. మూసీ పేరిట కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందంటూ దుయ్యబట్టారు. మూసీ సుందరీకరణను బీఆర్ఎస్ వ్యతిరేకించడం లేదని హరీష్‌రావు అన్నారు. "కేసీఆర్‌కు మధు పార్క్ రిడ్జ అపార్ట్‌మెంట్‌కు ప్రత్యేక అనుబంధం ఉంది. ఆ అపార్ట్‌మెంట్ వార్ రూమ్ నుండే .బీఆర్ఎస్ విజనరీ డాక్యుమెంట్‌ను తయారు చేశారు. ఈ అపార్ట్‌మెంట్‌కు కేసీఆర్ మూడుసార్లు వచ్చారు. మంచి నీరు లేవని.. అపార్ట్‌మెంట్ వాసులు కేసీఆర్‌ను కలిస్తే.. కేసీఆర్ వెంటనే మంచి నీటి సదుపాయాన్ని ప్రత్యేక పైప్లైన్ ద్వారా నీరు అందించారు. అపార్ట్‌మెంట్ వాసులను కేసీఆర్ నిలబెడితే రేవంత్ రెడ్డి కూల్చేస్తున్నాడు. మూసీ పేరుతో పేదల ఇండ్లు కూల్చొదు.. మూసీ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయొద్దు. ..రేవంత్ ఏది చేసిన రియల్ వ్యాపారం కోసమే.. మూసీ పేరుతో భూములు లాక్కొని బడా వ్యాపారులకు ఈ భూములు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఒక్క ఇల్లు కట్టలేదు కానీ పేదల ఇండ్లు కూల్చేస్తున్నారు. డబ్బులు లేవంటూనే ప్రపంచ సుందరి పోటీలు పెట్టారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి మూసి సుందరీకరణ చేస్తున్నారు. వీరి బతుకులను కూల్చకండి.. మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ వాసులకు ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోండి" అంటూ హరీష్‌రావు డిమాండ్ చేశారు.

## కొత్త నేతలను వెతికే పనిలో కాంగ్రెస్

-మొదటిపేజీ తరువాయి



చేశారు. రాష్ట్రంలో సుమారు 80 శాతం మంది ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఆస్వాదిస్తున్నారని, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే దానికి నిదర్శనమని ఖర్గే కొనియాడారు. ఇప్పటి వరకు అన్ని సానుకూలంగా సాగాయని, భవిష్యత్‌లో కూడా ఇదే పట్టుదలతో మంచి ఫలితాలు సాధించాలని నాయకత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలోనే మంత్రులు తమ శాఖల పనితీరును, అమలు చేస్తున్న కీలక పథకాలను అధిష్ఠానానికి వివరించారు. సమ్మక్క సారలమ్మ జాతరను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా, విజయవంతంగా నిర్వహించిన తీరును మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, వరి ఉత్పత్తిలో తెలంగాణ అగ్రస్థానంలో ఉందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నివేదిక ఇచ్చారు. పేదలకు ఇళ్ల నిర్మాణం, భూభారతి కార్యక్రమం ద్వారా చేపట్టిన భూసర్వే వివరాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో పామాయిల్ తోటల పెంపకం, దాని వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. గిగ్ వర్కర్స్ కోసం ప్రభుత్వం తీసుకురాబోతున్న కొత్త విధానం గురించి మంత్రి వివేక్ వివరించగా, ఈ చట్టాన్ని వీలైనంత త్వరగా తీసుకురావాలని రాహుల్ సూచించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబమైన సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణపై రాహుల్ గాంధీ ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ జాతర చరిత్ర, ప్రభుత్వం అక్కడ చేపట్టిన కొత్త నిర్మాణాల గురించి తెలుసుకున్న ఆయన, సమ్మక్క-సారలమ్మపై జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చేలా ఒక సినిమా తీస్తే బాగుంటుందని సలహా ఇచ్చారు. జాత విజయవంతం కావడంపై అభినందిస్తూ తనను కూడా ఆహ్వానించి ఉంటే వచ్చే వాళ్లమని అన్నారు. పాలనతో పాటు పార్టీ అంతర్గత వ్యవహారాలపై కూడా ఢిల్లీ వేదికగా చర్చ జరిగింది. ఇటీవల ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై విమర్శలు చేసిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంశంపై అధిష్ఠానం ఆరా తీసింది. త్వరలోనే ఆయనను ఢిల్లీకి పిలిపించి మాట్లాడతామని అగ్రనేతలు అన్నట్టు తెలుస్తోంది. అలాగే రాజ్యసభ ఎన్నికల అంశంపై మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్‌తో విడిగా చర్చించనున్నారు. పార్టీని బలోపేతం చేసే క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో పదివేల కంటే ఎక్కువ ఓట్ల తేడాతో ఓడిపోయిన నియోజకవర్గాల్లో ఇన్‌ఛార్జులను మార్చాలని హైకమాండ్ ఆదేశించింది. మరోవైపు కరీంనగర్ కార్పొరేషన్ ఫలితాల విషయంలో మాత్రం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆ స్థానాన్ని ఎందుకు సీరియస్‌గా తీసుకోలేదని రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ ప్రశ్నించగా, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు ఇచ్చిన వివరణ పట్ల వారు పూర్తి స్థాయిలో సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. రాష్ట్ర మంత్రివర్గమంతా ఢిల్లీ పర్యటనకు వెళ్లడంపై బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలను మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు. ఫామ్‌హౌస్ నుంచి పాలన చేయడం తప్పని, జాతీయ పార్టీ నాయకత్వానికి కలవడం ఎలా తప్పు అవుతుందని ఆయన ప్రశ్నించారు. బీఆర్ఎస్ దిల్లీలో పార్టీ కార్యాలయం ఎందుకు నిర్మించిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీల్లో అత్యధికం ఇప్పటికే అమలు చేస్తున్నామని, కేసీఆర్‌లా తాము ప్రజలను వదిలేసి పోయే రకం కాదని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగా మార్చి రెండో వారానికిల్లా నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్ణయించారు. మిగిలిన పీసీసీ కార్యవర్గ పోస్టులు, జిల్లా, బ్లాక్ కమిటీలను కూడా అదే గడువులోగా భర్తీ చేస్తామని మహేష్ కుమారు గౌడ్ వెల్లడించారు. ప్రభుత్వం, పార్టీ సమన్వయంతో పని చేయడం వల్లే స్థానిక సంస్థల్లో మంచి ఫలితాలు వచ్చాయని రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ వివరించారు.

**ప్రతిఘటన**
తెలుగు దిన పత్రిక

సోమవారం 23 ఫిబ్రవరి 2026

## విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేయాలి



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

పాఠశాల దశలోనే నైతిక పునాదులు బలంగా పడితే భవిష్యత్తులో బాధ్యతాయుతమైన వ్యక్తులుగా తయారవుతారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నరసింహారెడ్డి అన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో గల బడంగ్ పేట్ డివిజన్ లో ది మాస్టర్ మైండ్ స్కూల్ 5వ వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ.. విద్యా సంస్థలు అంచలంచెలుగా ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే గాక ఎంతో మంది విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు. పాఠశాల దశలోనే నైతిక పునాదులు బలంగా పడితే, భవిష్యత్తులో వారు బాధ్యతాయుతమైన వ్యక్తులుగా ఎదుగుతారని, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పాఠశాల దశలోనే బలమైన పునాదులు వేయాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టిగా కృషి చేయాలని పేర్కొన్నారు. నైతిక విలువల పెంపు, డిజిటల్ బోధన , శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం ద్వారా విద్యార్థులను భావి నాయకులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, చైర్మన్ రాజు, పాఠశాల సిబ్బంది, గొంగడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## సొంత గూటికి చేరుకున్న అందుగుల సత్యనారాయణ



ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని విజయం సాధిస్తుందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కాంగ్రెస్ కార్యాలయంలో కందుకూరు సీనియర్ నాయకులు, మహేశ్వరం నియోజకవర్గం తెలంగాణ జాగృతి ఇన్చార్జి అందుగుల సత్యనారాయణ సహా పలువురు కాంగ్రెస్ లో చేరారు. వారందరికీ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ మాట్లాడుతూ... కార్యకర్తల బలం, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని తెలిపారు. పార్టీని వీడిన నాయకులు మళ్లీ కాంగ్రెస్ లో చేరటం సంతోషమన్నారు. అందుగుల సత్యనారాయణ సహా మహిళలు, యువకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని కిచ్చెన్నగారు హామీ ఇచ్చారు. పంచాయతీలు, పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో హస్తం పార్టీ నాయకులకే పట్టం కట్టే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని లక్ష్మారెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సీహెచ్ యాదయ్య, మాజీ కాంగ్రెస్ యూత్ నాయకుడు ఢిల్లీ శ్రీధర్ ముదిరాజ్ , నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్క జొన్న రైతులకు ప్రభుత్వం బకాయి డబ్బులు వెంటనే విడుదల చేయాలి

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ రైతుల పక్షాన నిలబడే పార్టీ అని కందుకూరు మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ తెలిపారు. కందుకూరులో ఆయన మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా పార్టీ సహించదని స్పష్టం చేశారు. నేదునూరు గ్రామం కందుకూరు మండలంలో అతిపెద్ద గ్రామమని పేర్కొంటూ, అక్కడి మొక్క జొన్న రైతులకు బకాయి డబ్బులు విడుదల చేయకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రైతులను తిప్పలు పెట్టడం దురదృష్టకరమని అన్నారు. రైతుల కష్టాలు, బాధలు ప్రభుత్వం పట్టించుకోకపోతే ఆ పాపం తప్పకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తగులుతుందని హెచ్చరించారు. "ఇది నిజంగా రేవంత్ రెడ్డి రాజ్యమేనా?" అని ప్రశ్నించారు. అలాగే, గతంలో చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి రోడ్డుపై బైఠాయించాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని తెలిపారు. ఈ వారం రోజుల్లో రైతులకు బకాయి డబ్బులు విడుదల చేయకపోతే, కేవలం నేదునూరు గ్రామం మాత్రమే కాదు, కందుకూరు మండలంలోని అన్ని గ్రామాల రైతులతో కలిసి పెద్ద స్థాయిలో ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

## మంత్రి వాకాటి శ్రీహరిని కలిసిన రాజు ముదిరాజ్

మంత్రి వాకాటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసిన తుక్కుగూడ మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్ సప్పిడి రాజు ముదిరాజ్, స్థానిక నాయకులు

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



### ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించదు

# కవితక్క గర్జనతో దిగివచ్చిన సర్కార్

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించదని, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఆత్మగౌరవం కోసం సాగుతున్న పోరాటం సత్ఫలితాలను ఇచ్చిందని, ఇది తెలంగాణ జాగృతి పోరాట పటిమకు దక్కిన విజయమని తెలంగాణ జాగృతి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి పేర్కొన్నారు. ఆయన ఒక ప్రకటనలో ఆయన ప్రస్తుత రాజకీయ పరిణామాలు, ఉద్యమకారుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించిన తీరును వివరించారు. ?తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలకు తెగించి పోరాడిన ఉద్యమకారుల హక్కుల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని పాండురంగారెడ్డి స్పష్టం చేశారు. "ఉద్యమకారుల సమస్యలను గాలి కొదిలేస్తే సీఎం రేవంత్ రెడ్డి ని బంగ్లా బయటకు గుంజుతారు" అని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన శక్తివంతమైన హెచ్చరికతోనే రాష్ట్ర



ప్రభుత్వంలో చలనం వచ్చిందని ఆయన అన్నారు. ఈ ఒత్తిడి ఫలితంగానే రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా వచ్చి ఉద్యమకారుల సమస్యలను వినడం, వారికి తక్షణమే న్యాయం చేస్తామని హామీ ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు.

కేటీఆర్ మౌనంపై విస్మయం వ్యక్తం చేశారు. ?ఇదే సందర్భంలో బీఆర్ఎస్ పార్టీ వైఖరిని పాండురంగారెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఒకవైపు కవితక్క ఉద్యమకారుల కోసం అలుపెరగని పోరాటం చేస్తుంటే, మరోవైపు కేటీఆర్ కనీసం నోరు మెదపకపోవడం విస్మయం కలిగిస్తోందని అన్నారు. "అధికారంలో ఉన్నప్పుడు ఉద్యమ ద్రోహులకు పెద్దపీట వేసి, అసలైన ఉద్యమకారుల ఉనికి లేకుండా చేశామన్న అపరాధ భావనతోనే కేటీఆర్ ముఖం చాటేస్తున్నారా? లేక తన తప్పును ఇంకా తెలుసుకోలేదా?" అని తెలంగాణ సమాజం తరపున ఆయన సూటిగా ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఏ కష్టం వచ్చినా, వారి ఆత్మగౌరవానికి భంగం వాటిల్లినా కవితక్క ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలబడి పోరాడుతారని ఈ పరిణామం మరోసారి రుజువు చేసిందని పాండురంగారెడ్డి అన్నారు. ఉద్యమకారుల సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు తెలంగాణ జాగృతి విశ్రమించదని ఆయన స్పష్టం చేశారు.

# సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడవాలి

బంజారాలు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలి
మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడిచి బంజారాలు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. జిహెచ్ఎంసి మీర్ పేట్ 60 డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి హిల్స్ జిల్లెలగూడ సేవాలాల్ భవన్ దగ్గర ఎర్పాటు చేసిన సంత్ శ్రీశ్రీశ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జన్మదిన మహోత్సవాలలో ముఖ్య అథితులుగా రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హాజరయ్యారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బంజరాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడులను జిహెచ్ఎంసి మీర్ పేట్ 60వ డివిజన్ లో నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని .సేవాలాల్ మహారాజ్ అహింసా సిద్ధాంతానికి పునాది వేసి అచరించి చూపారని తెలిపారు. బంజారాలు అనాడు రాజుల కాలం నుండి బ్రిటీష్‌కాలం వరకు అయా రాజ్యాలకు అవసరమైన యుద్ధ సామాగ్రిని చేరవేస్తూ సంచార జీవనం సాగిస్తూ ఉండే వారని తెలిపారు. సేవాలాల్ మహారాజ్ బోదనల వల్ల బంజారా జాతిపురోగమించడానికి కృషి చేయడం జరిగిందని తెలిపారు. సంత్ సేవాలాల్ మహారాజ్ అడుగుజాడల్లో నడిచి ప్రతీ



ఒక్కరు బాగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. బంజారాలకు రిజర్వేషన్ కల్పించి, ఉన్నత స్థితికి రావడానికి సేవాలాల్ మహారాజ్ ఎంతగానో కృషిచేశారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్, దోమలపల్లి రాజ్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్లు అబ్బనమోని గోపి యాదవ్, పోరెడ్డి ప్రభాకర్ రెడ్డి, అనిత హతిరాం నాయక్, మాజీ ఎంపీటీసీ కాట్రావత్ కోట్యా నాయక్, మాజీ టెంపుల్ డైరెక్టర్ సుర్వి లత శేఖర్ గౌడ్, నాయకులు సాయి యాదవ్ సేవాలాల్ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఫోఫేసర్ "డా" శంకర్ కుమార్ నాయక్, పూర్యా నాయక్ , బన్సీలాల్ నాయక్, వెంకటేష్ నాయక్, జగన్ నాయక్, రత్తు నాయక్, రాములు నాయక్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ గౌడ కౌన్సిలర్లకు ఘన సన్మానం

**జై గౌడ ఉద్యమ సంఘ జిల్లా మహిళా అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్**

ప్రతిఘటన, నాగర్ కర్నూల్ బ్యూరో రిపోర్టర్ విజయ్ కాంత్

ఇటీవల జరిగిన మున్సిపాలిటీ ఎన్నికలలో నూతనంగా ఎన్నికైన గౌడ కులస్తుల కౌన్సిలర్లకు ఆదివారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ గౌడ కౌన్సిలర్లకు జైగౌడ ఉద్యమ సంఘం నాగర్ కర్నూల్ జిల్లా వారిచే శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జైగౌడ ఉద్యమ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గుండ్రాతి నారాయణ గౌడ్ కౌన్సిలర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కులస్తులు అన్ని విభాగాలలో ప్రాతినిధ్యం వహించాలని, ప్రజలకు మెరుగ్గా ప్రజా సేవలందించుటకు ముందుండాలని ఆయన పిలుపునిచ్చారు. జైగౌడ నాగర్ కర్నూల్ జిల్లా ఉద్యమ మహిళ అధ్యక్షురాలు సోమ ప్రగతి గౌడ్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువలో చేర్చుటకు ప్రతి గౌడ కులస్తుడు రాజకీయ, ఆర్థిక, ఉద్యోగ సంక్షేమ విభాగాలలో ముందుండాలని ఆమె కోరారు. నాగర్ కర్నూల్ లో నూతనంగా ఎన్నికైన19వ వార్డు కౌన్సిలర్ కాట గౌని సునీత



శ్రీనివాస్ గౌడ్, మూడో వార్డు నుండి ఎంపికైన వసంత సంతోష్ గౌడ్,9వ వార్డ్ కౌన్సిలర్ గా గెలుపొందిన సుంకరి అలివేల, రాజేష్ గౌడ్ గారిని పూలమాలలు, శాలువలతో ఘనంగా సన్మానం చేశారు. నాగర్ కర్నూల్ పట్టణ ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉండి ప్రజాసేవలో నూతన కౌన్సిలర్లు ముందుండాలని ఈ సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమ యూత్ అధ్యక్షులు కటగౌని హరీష్ గౌడ్, ప్రసాద్ గౌడ్, సింగారి జ్యోతి గౌడ్, పలుస నిర్మల గౌడ్, గుండ్రాతి సత్యం గౌడ్, కల్పన, సువర్ణ, నిర్మల, యశోద, సుమతమ్మ, విద్య, పుష్ప, శోభ, హేమలత, కవిత, పద్మ, స్రవంతి గౌడ సంఘం నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## సత్ ప్రవర్తనతో మెలగాలని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నేరాలకు పాల్పడాలనే ఆలోచనలు మానుకోవాలి

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే రౌడీషీటర్ల పై కఠిన చర్యలు తీసుకుంటామని పహాడీషరీఫ్ ఇన్ స్పెక్టర్ లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. పోలీస్ స్టేషన్ కార్యాలయంలో రౌడీషీటర్లకు ఇన్ స్పెక్టర్, ఎస్ఐ లు దయాకర్ రెడ్డి, లక్ష్మయ్య, పైసల్ ఖాన్ తో కలిసి కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్ల నేర చరిత్ర, వారి పై ఉన్న కేసుల వివరాలు, ప్రస్తుత జీవన విధానం, ఉద్యోగ స్థితిగతులను గురించి ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇన్ స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న రౌడీషీటర్లు, పాత నేరస్థులు నేర ప్రవృత్తిని పూర్తిగా వదిలేసి, సమాజంలో అందరితో కలిసి మెలిసి జీవించాలన్నారు, నేరాలకు పాల్పడాలనే ఆలోచనలు మానేసి, కష్టపడి గౌరవ ప్రదమైన పనులు చేసుకుంటూ మంచి నడవడికతో బ్రతకాలని, తద్వారా తమ కుటుంబాలకు సమాజంలో మంచి గుర్తింపుతో పాటుగా విలువ పెరుగుతుందని అన్నారు. ముఖ్యంగా రాబోయే జిహెచ్ఎంసి డివిజన్ ఎన్నికల నేపథ్యంలో ఎవరైనా గొడవలకు, ఆందోళనలకు గానీ పాల్పడితే వారిని గుర్తించి పోలీసులు చట్టపరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఎస్సై లు మాట్లాడుతూ ప్రతి రౌడీ షీటర్లకు, పాత నేరస్తులు తమ నేర ప్రవృత్తిని స్వస్తి పలికి సమాజంలో గౌరవ ప్రదంగా మెదులుతూ తమ వంతుగా కుటుంబాన్ని, పిల్లలను బాధ్యతగా చూసుకోవాలన్నారు.

## చత్రపతి శివాజీ స్ఫూర్తి తో పోరాటాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

ప్రతిఘటన ,మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య



చత్రపతి శివాజీ స్ఫూర్తి తో పోరాటాలు చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోలన్ శంకర్ రెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ని , కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణ రెడ్డి ని పోలీసులు అడ్డుకొని హౌస్ అరెస్టు చేసి నిర్బంధించారని తెలుసుకొని శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వారి ఇంటికి వెళ్లి రాష్ట్ర చీఫ్ రామచందర్ రావ్ ని సంఘటన విషయాలు అడిగి తెలుసుకున్నారు . వారితో పలు విషయాలు చర్చించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు అరెస్ట్ చేయడం దారుణం అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పై చత్రపతి శివాజీ స్ఫూర్తి తో పోరాటాలు చేయాలని ఈ ప్రభుత్వాన్ని గద్దె దించాలని అని విజ్ఞప్తి చేసి " శాలువాతో సత్కరించి, హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ విగ్రహాని భాహుకరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు రామిడి మహేందర్ రెడ్డి, మునగాల ప్రభాకర్ రెడ్డి, పెద్దింటి సుధాకర్, లక్ష్మణ్ రాజ్ బాస్కర్, ప్రదీప్ పాల్గొన్నారు.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
సోమవారం 23 ఫిబ్రవరి 2026

# యాసంగి సాయంపై నీలినీడలు..

**సీజన్ ప్రారంభమై మూడు నెలలు దాటినా పట్టించుకోని ప్రభుత్వం**

**2023 వానకాలం సీజన్ వరకు కేసీఆర్ ప్రభుత్వం అందించిన రైతుబంధు వివరాలు**

**నేటికీ అందని 'రైతు భరోసా'**

**నిర్మల్ జిల్లావ్యాప్తంగా 1,88,597 మంది రైతుల ఎదురుచూపు**

**అన్నదాతను వెంటాడుతున్న ఆర్థిక కష్టాలు**

**అప్పుల కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్న రైతులు**



**నిర్మల్ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. ఎన్నికలకు ముందు అలవికాని హామీలిచ్చి అందలమెక్కిన తర్వాత సబ్బండ వర్గాల ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతులను నట్టేట ముంచింది. ఒకవైపు యూరియా కష్టాలు, మరోవైపు పంట పెట్టుబడి సాయం అందకపోవడంతో రైతులు కష్టాల సాగును కొనసాగిస్తున్నారు. అటు బ్యాంకులు సహకరించక పోతుండడం, ఇటు ప్రభుత్వం కనికరించకపోవడంతో వారంతా మళ్లీ ప్రైవేటు అప్పుల బాట పడుతున్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి అప్పులు తీసుకొని సాగు చేస్తున్నారు. వీరంతా గత సీఎం కేసీఆర్‌ను దేవుడిలా అభివర్ణిస్తూ తమ సాగుకు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నాడని గుర్తు చేసుకుంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లపాటు ప్రతి సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం అందించి అప్పుల ఊబిలో కూరుకుపోయిన అన్నదాతలను ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు పేరును రైతుభరోసా అని మార్చిందే గాని, అమలు చేయడంలో మాత్రం కుంటి సాకులు వెతుకుతున్నది. అప్పట్లో కేసీఆర్ ప్రభుత్వం ఎకరాకు ఏడాదికి రూ.10 వేలు ఇవ్వగా, అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఎకరాకు రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి, అమలులోకి వచ్చే సరికి రూ.12 వేలుగా నిర్ణయించింది. అయితే దానిని కూడా అమలు చేయడంలో తీవ్ర జాప్యం చేస్తున్నది. ప్రస్తుత యాసంగి సీజన్ ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావస్తున్నా నేటికీ రైతుభరోసా అందకపోవడంతో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం 1,88,597 మంది రైతులు రైతు భరోసా కోసం ఎదురు చూస్తున్నారు. వీరికి పెట్టుబడి సాయం కింద రూ.268.85 కోట్లు విడుదల చేయాలి. మున్సిపల్ ఎన్నికలు ముగియగానే రైతు భరోసా అందజేస్తామని కొన్ని రోజులుగా ప్రభుత్వ పెద్దల నుంచి ప్రకటనలు వస్తున్నాయే తప్ప అవి ఆచరణకు నోచుకోవడం లేదు. ఎన్నికలు ముగిసి వారం రోజులవుతున్నా ప్రభుత్వం రైతు భరోసా ఊసెత్తడం లేదు. త్వరలోనే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉండడంతో రైతుభరోసా నిధుల విడుదలపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. ప్రాదేశిక ఎన్నికల కోడ్‌ను బూచిగా చూపి ఈ యాసంగి సీజన్ భరోసా డబ్బులు ఎగవేసేందుకు ప్రభుత్వం యత్నిస్తున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

### 3 లక్షల ఎకరాల్లో సాగు

ప్రస్తుత యాసంగి సీజన్‌లో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా రైతులు దాదాపు 3 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధికారుల నివేదిక ప్రకారం 1.10 లక్షల ఎకరాల్లో వరి, 1.02 లక్షల ఎకరాల్లో మక్క, 35 వేల ఎకరాల్లో జొన్న, 55 వేల ఎకరాల్లో శనగ సాగు చేసినట్లు చెబుతున్నారు. ఆయా పంటల సాగు కోసం అవసరమైన పెట్టుబడి ఖర్చులను ప్రభుత్వం ఇవ్వకపోవడంతో చాలా మంది రైతులు అప్పులు చేసి సాగు చేస్తున్నారు. రైతు భరోసా డబ్బులు అందితే చేసిన అప్పులు తీర్చవచ్చనే ఆలోచనతో రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ యాసంగికి రైతు భరోసా డబ్బులను ఇస్తామని ప్రకటనలు చేస్తున్నారే తప్ప ప్రభుత్వ పెద్దల నుంచి ఎలాంటి స్పష్టత లేకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి రెండు సీజన్లలో ఇస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేసింది. అలాగే గత వానకాలం సీజన్‌లో అనేక ఆంక్షలు అమలు చేసి అరకొర సాయాన్ని అందజేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. రైతు భరోసా అమలు కోసం కొత్త నిబంధనలు రూపొందించాలని, అర్హులకే ఇవ్వాలని, గతంలో అవకతవకలు జరిగాయంటూ వట్టి మాటలు చెప్పి రైతులను మభ్యపెట్టేందుకు పాలకులు యత్నిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇటీవల వ్యవసాయ మంత్రి ఏ భూములు సాగయ్యాయో తెలుసుకునేందుకు శాటిలైట్ ద్వారా పరిశీలించిన తర్వాతనే రైతు భరోసా సాయాన్ని అందిస్తామని ప్రకటించారు. ఈ మేరకు సాగు భూములను సర్వే చేసిన అధికారులు ఎందరికి కోత పెడతారోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. చేతిలో పెట్టుబడి సాయం లేకపోవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తీసుకొచ్చి సాగు చేస్తున్నారు. ఇప్పటికైనా రైతులకు ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా కింద పంట పెట్టుబడి సాయాన్ని అందించి ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# రైతు భరోసా ఇంకెప్పుడు?



**కరీంనగర్ :** తెలంగాణ రాక ముందు తొలకరి వచ్చిందంటే ఎంతో మంది రైతులు పెట్టుబడి కోసం అరిగోస పడేది. చేతిలో చిల్లిగవ్వ లేక బ్యాంకుల చుట్టూ తిరిగేది. అక్కడ రుణం రాక వడ్డీ వ్యాపారులను ఆశ్రయించేంది. పంట దిగుబడి చేతికి రాగానే అమ్మి.. అసలు వడ్డీ కట్టేది. మళ్లీ సీజన్ రాగానే కథ పునరావృతమయ్యేది. స్వరాష్ట్రంలో ఈ పరిస్థితి మారింది. సరైన పెట్టుబడి ఉంటే రైతులు నిరందీగా పంటలు పండించగలుగుతారని భావించిన కేసీఆర్ సర్కారు, 'రైతుబంధు' అమలు చేసింది. ప్రతి ఎకరాకు ఏడాదికి 10 వేల ఆర్థిక సహాయాన్ని అందించింది. సీజన్ ప్రారంభంలోనే ఖాతాల్లో నగదు జమ చేయడంతో రైతులకు పెట్టుబడి భారం తప్పింది. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసుకొని, నిశ్చితంగా సాగు చేసుకునేది. కానీ, కాంగ్రెస్ సర్కారు వచ్చిన తర్వాత పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. రైతు భరోసా అమలుకు కాంగ్రెస్ సర్కారు ఆపసోపాలు పడుతున్నది. తరచూ ఇప్పుడూ అప్పుడూ అంటూ వాయిదాల మీద వాయిదాలు వేస్తున్నది. సకాలంలో ఇవ్వకుండా రైతులను గోస పెడుతున్నది. సీజన్ ప్రారంభంలో వేయాల్సిన పంట పెట్టుబడిని సంక్రాంతికి వేస్తామని చెప్పి దాటవేసింది. ఆ తర్వాత జనవరి 26న ఖాతాల్లో జమ చేస్తామని చెప్పి మరోసారి మాట తప్పింది. ఇప్పుడు ఎప్పుడిస్తారో తెలియని గందరగోళ పరిస్థితి ఉండగా, పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఆపుతున్నట్టు తెలుస్తున్నది. ప్రస్తుత పరిణామాలను చూస్తే ఎన్నికలకు ముందు రైతు భరోసా ఇచ్చి ఓట్లు పొందాలనే ఆలోచనలో ఉన్నట్టు అర్థమవుతున్నది. ఈ ఎన్నికలు జరిగేదెప్పుడు తమకు రైతు భరోసా వచ్చేదెప్పుడని రైతులు నిరాశకు గురవుతున్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోని సర్కారు తీరుపై మండిపడుతున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా పథకానికి తూట్లు పొడుస్తున్నది. పథకం పేరు మార్చి ఎకరాకు ఏడాదికి 12 వేలు ఇస్తామని చెప్పినా.. అమలులో మాత్రం తీవ్ర జాప్యం చేస్తున్నది. అనేక సాకులు చూపి వేలాది మంది రైతులను ఈ పథకం నుంచి తప్పించింది. సాగుయోగ్యత లేని భూములపై ముందుగా అధికారులతో సర్వే చేయించిన సర్కారు, కరీంనగర్ జిల్లాలో 5,476 ఎకరాలను తొలగించింది. ఇప్పుడు సాగు చేసిన భూములకు మాత్రమే ఇస్తామని చెబుతూ.. శాటిలైట్ సర్వే ద్వారా ఇమేజ్ మ్యాపింగ్ చేసి అర్హులైన రైతులను ఎంపిక చేస్తామని మెలిక పెట్టింది. నిజానికి ఈ యాసంగి సీజన్ ప్రారంభంలో అంటే గత అక్టోబర్, నవంబర్‌లోనే రైతు భరోసా అందాల్సి ఉంది. అప్పుడు సంక్రాంతి వరకు ఇస్తామని మభ్యపెట్టింది. కానీ, ఇవ్వకుండా.. జనవరి 26కు వాయిదా వేసింది. ఆ గడువు కూడా దాటిపోయింది. అసలు రైతు భరోసా ఇస్తారా.. ఇవ్వారా..? అనేది ఎక్కడా స్పష్టత లేదు. అధికారులను అడిగినా కచ్చితమైన సమాధానం రావడం లేదు. జనవరి నుంచి అధికారుల నుంచి ఇదే సమాధానం వస్తున్నది. కానీ ఎప్పుడిస్తారనేది మాత్రం ఎవరూ చెప్పడం లేదు. ఈ నేపథ్యంలో రైతులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. వస్తుందనే నమ్మకాన్ని కూడా కోల్పోతున్నారు.

### సకాలంలో అందింది లేదు

కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం లేదు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కింద ఎకరాకు ఏడాదికి 15 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు మాట మార్చింది. కేవలం 12 వేలు ఇస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఏ ఒక్క సీజన్‌లో కూడా సకాలంలో అందించ లేకపోయారు. అందినా అర్హులైన రైతులందరికీ ఇవ్వలేకపోయారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 2023-24 యాసంగి సీజన్ మొదటి సారి వచ్చింది. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేటాయించిన నిధులనే ఎకరాకు 5వేల చొప్పున వచ్చింది. 2024 వానకాలంలో పూర్తిగానే ఎగ్గొట్టింది. 2024-25 యాసంగిలో మాత్రం మూడెకరాలు ఉన్న రైతుల వరకే ఇచ్చింది. అంతకు ఎక్కువ ఉన్న రైతులకు మొండిచేయి చూపింది. 2025 వానకాలంలో మాత్రం పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పూర్తి స్థాయిలో ఇచ్చింది. ఇప్పుడు యాసంగి సీజన్ వచ్చే సరికి సాగు చేసిన భూములకే మాత్రమే రైతు భరోసా ఇస్తామని రాష్ట్ర సర్కారు చెబుతున్నది. అందుకు శాటిలైట్ సర్వే ద్వారా ఇమేజ్ మ్యాపింగ్ చేసి అర్హులను నిర్ణయిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రకటించారు. కానీ, యాసంగి సీజన్ మధ్యకు వచ్చినా ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకున్నట్టు కనిపించడం లేదు..

### భారం తగ్గించుకుంటున్న సర్కారు

రైతు భరోసాపై రైతుల్లో తీవ్రమైన గందరగోళం నెలకొన్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ ఒక్క సీజన్‌లో కూడా రైతులకు సకాలంలో రైతు భరోసా అందించ లేక పోయింది. నాట్ల సమయంలో ఇవ్వాల్సిన భరోసాను కోతల సమయంలో ఇవ్వడంతో సాగు అసరాలకు వినియోగించు కోలేని పరిస్థితి ఏర్పడుతున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వానకాలం పంటలకు ఏప్రిల్, మేలో.. యాసంగి పంటలకు అక్టోబర్, నవంబర్‌లో రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు జమయ్యేది. కాంగ్రెస్ పాలనలో అసలు సకాలంలో అందకపో వడం ఒక ఎత్తయితే.. వచ్చినప్పుడు కూడా అర్హులైన రైతుల్లో చాలా మందికి అందడం లేదు. 2024-25 యాసంగి సీజన్‌లో జిల్లాలోని అనేక మంది అర్హులైన రైతుల ఖాతాల్లో రైతు భరోసా జమ కాకపోవడమే అందుకు నిదర్శనం. ఆ సీజన్‌లో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 2,09,450 మంది రైతులను అర్హులుగా గుర్తించి 213.95 కోట్లు కేటాయించారు. కానీ, కేవలం 1,95,945 మంది వివరాలు మాత్రమే అధికారుల వద్ద ఉండగా వాటిని మాత్రమే ట్రెజరీకి పంపించారు. మిగిలిన 13,505 మందికి అన్యాయం జరిగింది. అంతే కాకుండా భూభారతి (ధరణి) పోర్టల్లో భూములు నమోదై ఉన్న రైతులకు కూడా రైతు భరోసా అందలేదు. సాగు యోగ్యమైన భూముల సర్వే చేసినప్పుడు అధికారులు రీ సర్వే సెటిల్‌మెంట్ రిజిస్టార్ (ఆర్ఎస్ఆర్)లో నమోదు చేశారు. అందులో విస్తీర్ణం తక్కువ ఉండి, పట్టాదారు పాసు పుస్తకంలో ఎక్కువ ఉన్న రైతులకు ప్రభుత్వం మొండి చేయి చూపింది. అంతేకాకుండా పట్టాదారు పాసు పుస్తకంలో ఉన్న పూర్తి స్థాయి భూమికి రైతు భరోసా అందలేదు. రైతు భరోసా అమలుకు క్రాప్ బుకింగ్ పోర్టల్‌ను కూడా పరిగణలోకి తీసుకున్నారు. ఒకట్రెండు సీజన్లలో పంటలు సాగు చేయకుంటే ఖాళీగా చూపించారు. ఆ తర్వాత సాగు చేసినా వారికి కూడా ఇవ్వలేదు. ఇలాంటి సాంకేతిక సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు జిల్లాలో 16 వేలకుపైనే ఉన్నట్టు తెలుస్తున్నది. వీటిని పరిష్కరించాలనే ఆలోచనలో ప్రభుత్వం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ఎంత తక్కువ విస్తీర్ణానికి రైతు భరోసా ఇస్తే అంత ఆదా అవుతుందనే ధోరణిలో ప్రభుత్వం కనిపిస్తున్నది. అందుకు అనేక సాకులు వెతుకుతోందనే అనుమానాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.

### పరిషత్ ఎన్నికలకు లింక్?

రైతు భరోసాను రాష్ట్ర ప్రభుత్వం రాజకీయంగా వాడుకోవాలని చూస్తున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. నిజానికి ఈ యాసంగి సీజన్‌కు గతేడాది అక్టోబర్, నవంబర్‌లోనే రైతు భరోసా ఇవ్వాల్సి ఉంది. కుంటి సాకులు చెబుతూ వాయిదాల మీద వాయిదాలు వేస్తున్న ప్రభుత్వం ఈ పథకాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. వచ్చే జిల్లా, మండల ప్రజా పరిషత్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్‌కు ముందు రైతు భరోసా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఇదే నిజమైతే ఈ ఎన్నికలపై ఇప్పటి వరకు స్పష్టత లేదు. తమకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతనే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని మరోపక్క బీసీలు ఉద్యమించే పరిస్థితి కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో ఎన్నికలకు ముడిపెట్టి తమను ఎందుకు ఇబ్బందులు పెడతారని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక సార్లు వాయిదాలు వేసిందని, ఇప్పుడు సీజన్ పూర్తికాక ముందైనా ఇవ్వాలని కోరుతున్నారు.

## సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను బెదిరిస్తున్న అమెరికా : సీపీఐ




**తాండూర్ :** అమెరికా దేశం సుంకాల పేరుతో ప్రపంచ దేశాలను బెదిరింపులకు గురిచేస్తుందని సీపీఎం పార్టీ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యుడు దాగాం రాజారాం ఆరోపించారు. సీపీఎం తాండూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని భగత్ సింగ్ భవన్ లో రెడ్ బుక్ డేను నిర్వహించారు. అమెరికా సామ్రాజ్యవాదం అనే పుస్తకంపై నిర్వహించిన పుస్తక పఠనంలో ఆయన మాట్లాడారు. సామ్రాజ్యవాద దురగతాలను ఎండగట్టాలి అనే ఉద్దేశ్యంతో 1948 ఫిబ్రవరి 21న లండన్‌లో ముద్రితమైన కమ్యూనిస్టు ప్రణాళిక మేనిఫెస్టో విడుదలై ప్రకంపనలను సృష్టించిందని పేర్కొన్నారు. భారత దేశం పైన సుంకాలు విధించి హెచ్చరికలు చేసిందని తెలిపారు. రష్యా, చైనాలు దీటుగా సమాధానాలు చెబుతుండగా, పెద్ద ప్రజాస్వామ్య దేశమని చెప్పుకునే మనం మోదీ నాయకత్వాన,ఒక్క మాట మాట్లాడటం లేదని ఆరోపించారు. అమెరికా సామ్రాజ్య వాదానికి తలొగ్గి దేశ ప్రయోజనాలను, ప్రతిష్టను తాకట్టు పెడుతున్నదని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు దుర్గం నానయ్య, చెల్పుల శంకర్, బొల్లం రాజేశం, సోమ మొగిలి, లింగం బానేష్, నాయకులు పాల్గొన్నారు.

## పెద్దపల్లి జిల్లా కళాకారుల అభ్యున్నతికి సమర శంఖం.. గోదావరిఖనిలో సన్నాహక సమావేశం



**కోల్ :** ఎన్నికలకు ముందు కళాకారులకు ఇచ్చిన వాగ్దానాలు... హామీలు సాధించే దిశగా సమర శంఖం పూరిస్తున్నట్లు ప్రముఖ కళాకారులు స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ కళా రంగాల్లో నిష్ణాతులైన 24 విభాగాల కళాకారుల అభ్యున్నతికి కళాతోరణం ముందడుగు వేయడం శుభ సూచికమని పలువురు కళాకారులు అభిప్రాయ పడ్డారు. గోదావరిఖని మార్కండేయ కాలనీలోని స్నేహ సాహితీ గ్రంథాలయంలో ఆదివారం కళాతోరణం ఆర్టిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం జరిగింది. జిల్లాలోని 24 విభాగాలకు చెందిన కళాకారులు హాజరయ్యారు. కళాకారుల సంక్షేమం, ఐక్యత, హక్కుల పరిరక్షణ లక్ష్యంగా కార్యచరణ రూపొందించుకున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఎన్నికలకు ముందు రాష్ట్ర ప్రభుత్వం కళాకారులకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలను అమలు చేసే విధంగా కళాతోరణం బాధ్యత తీసుకొని ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. జిల్లాలోని కళాకారులు ఐక్యంగా ఉంటేనే ఏదైనా సాధ్యపడుతుందని పేర్కొన్నారు. అనంతరం జనగామ తిరుపతి ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్ను అవిష్కరించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీనియర్ కళాకారుడు సత్యనారాయణకు నివాళులర్పించారు. మంచిర్యాల జిల్లాల కళాకారులు శ్రీనివాస్, గంగ భవానీలు పాల్గొని ఈ ప్రాంత కళాకారుల ఐక్యత తమకు ఆదర్శమని కొనియాడారు. ఈ సమావేశంలో కళాకారులు అశోక్ వేముల, బడికెల గణేశ్, జక్కిని శ్రీలత నేత, మేకల శ్రీకాంత్, వేణుగోపాల్, నిర్మాతల సంఘం అధ్యక్షులు కొమ్ము కుమార్, సీనియర్ కళాకారులు దామెర శంకర్, శంకర్, సత్యవతి, రాజేశ్, మహేశ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## మ్యాడారం తండాలో సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు



**సారంగాపూర్ :** సారంగాపూర్ మండలంలోని మ్యాడారం తండా గ్రామంలో ఆదివారం బంజారాలా ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ 287 జయంతి భోగి బండార్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతు సేవాలాల్ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దురాచారాలను అపోహలను ఆశాస్త్రీయమైన అపోహలను నమ్ముతు జీవిస్తున్న బంజారా జాతులను తన ఆలోచనలు ప్రసంగాలతో చైతన్యపర్చిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని గిరిజనులు సంతు సేవాలాల్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భుక్య భారతి చిరంజీవి, ట్రాన్స్ కో ఏడీఈ భుక్య జవహర్ లాల్ నాయక్, ఉప సర్పంచ్ గుగులోతు కిషన్, గ్రామ కార్యదర్శి రవి, గిరిజన నాయకులు, బంజార యూత్ సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన చిగిరింత నరసింహారెడ్డి



హైదరాబాద్ దేవరయంజాల్ కన్వేషన్ హాల్ లో జరిగిన అరవింద్ రెడ్డి, డా.రజిత ల వివాహ వేడుక ఆశీర్వదించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నరసింహారెడ్డి

ప్రతిఘటన, మహేశ్వరం రిపోర్టర్ ముత్తయ్య

# బిజినెస్

## ఆ ఐటీ కంపెనీ ఉద్యోగుల్లో ఫుల్ జోష్




దేశంలో అతిపెద్ద ఐటీ కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్‌లో (టిసిఎస్) పనిచేసే ఉద్యోగుల్లో ఫుల్ జోష్‌లో ఉన్నారు. కారణం.. మధ్య, సీనియర్ స్థాయి ఉద్యోగుల త్రైమాసిక వేరియబుల్ పేను మూడో త్రైమాసికంలో గరిష్ఠంగా 80 శాతం వరకు పెంచింది. దాదాపు రెండేళ్లుగా తక్కువ స్థాయిలో కొనసాగిన చెల్లింపుల తరువాత ఇది గణనీయమైన మార్పుగా భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో మధ్య, సీనియర్ స్థాయి సిబ్బందికి వేరియబుల్ పే 20--50 శాతం మధ్యకే పరిమితమై ఉండేది. ఇప్పుడు అక్టోబర్--డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి చాలామంది మధ్యస్థాయి ఉద్యోగులు సుమారు 80 శాతం వేరియబుల్ చెల్లింపులు పొందినట్లు సమాచారం. సీనియర్ స్థాయి ఉద్యోగులకు 40--80 శాతం మధ్య చెల్లింపులు జరిగినట్లు తెలిసింది. 'మనీ కంట్రోల్' కథనం ప్రకారం.. ఉద్యోగులకు జనవరిలో ఈ మొత్తాలు జమయ్యాయి. కంపెనీ వర్గాల ప్రకారం.. మొత్తం ఉద్యోగుల్లో 70 శాతం మందికి పైగా తమ త్రైమాసిక వేరియబుల్ వేతనంలో 100 శాతం అందుతోంది. అయితే, పూర్తి చెల్లింపులు ఎక్కువగా జూనియర్ స్థాయి ఉద్యోగులకే పరిమితమై ఉన్నట్లు తెలుస్తోంది.

**ఇన్ఫోసిస్‌లోనూ బలమైన చెల్లింపులు**

ఇక మరో దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ కూడా డిసెంబర్ 31, 2025తో ముగిసిన త్రైమాసికానికి సగటున 85 శాతం పనితీరు బోనస్ చెల్లింపులు విడుదల చేసింది. గత మూడున్నరేళ్లలో ఇది బలమైన వేరియబుల్ పే ఫలితంగా నిలిచింది.

## వివో నుంచి ప్రీమియం ఫోన్లు..
## 'జీస్' ట్రిపుల్ కెమెరాతో..

**న్యూఢిల్లీ:** వివో ఇండియా తన 'వీ' సిరీస్ నుంచి 'వివో వీ70', 'వివో వీ70 ఎలైట్' పేర్లతో రెండు ప్రీమియం స్మార్ట్ ఫోన్లను భారతీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఫోటోగ్రఫీకి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే 'వివో' ఈసారి కెమెరాలకు ప్రసిద్ధి చెందిన 'జీస్' సంస్థతో ప్రత్యేక భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుంది. రెండు ఫోన్లలోనూ జీస్ పార్ట్‌నర్‌షిప్‌తో కూడిన ట్రిపుల్ కెమెరా సెటప్ ఉంది. 50 మెగా పిక్సెల్(ఎంపీ) ప్రైమరీ కెమెరా, 50 ఎంపీ టెలి ఫొటోలెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా ఇచ్చారు. ఉత్తమ సెల్ఫీల కోసం ముందు భాగంలో 50 ఎంపీ జీస్ ఫ్రంట్ కెమెరా ఉంది. అల్యూమినియం ఫ్రేమ్, రౌండెడ్ కార్నర్లతో ప్రీమియం లుక్ ఇచ్చారు. వీటికి ఐపీ68, ఐపీ69 రేటింగ్ ఉండడంతో నీరు, దుమ్ము, ధూళి నుంచి రక్షణ లభిస్తుంది. 6.59 అంగుళాల అమోలెడ్ డిస్‌ప్లే ఇచ్చారు. 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటుకు, 5000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌కు సపోర్ట్ చేస్తాయి. ఈ రెండూ ఆండ్రాయిడ్ 16తో కూడిన ఆరిజన్ ఓఎస్6తో పనిచేస్తాయి. వీటికి ఆరేళ్ల సాఫ్ట్‌వేర్ సపోర్ట్ ప్రకటించింది. రెండు ఫోన్లలో భారీ 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. ఇది 90డబ్ల్యూ ఫ్లాష్‌ఛార్జ్‌కి సపోర్ట్ చేస్తుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 40 గంటల వీడియో ప్లేబ్యాక్ లేదా 11 గంటల నావిగేషన్ లభిస్తుందని కంపెనీ పేర్కొంది. హీట్ తగ్గించడానికి 'బైపాస్ ఛార్జింగ్' సౌకర్యం కూడా ఉంది. ఇందులో స్నాప్‌డ్రాగన్ 7 జెన్4 ప్రాసెసర్‌ను అందించారు. రోజువారీ పనులు, గేమింగ్‌కు అనుకూలంగా ఉంటుంది. రెండు వేరియంట్లలో లభిస్తుంది. 8జీబీ‌ం 256జీబీ వేరియంట్ ధర రూ.45,999గా కంపెనీ నిర్ణయించింది. 12జీబీ‌ం 256జీబీ వేరియంట్ రూ.49,999కు లభిస్తుంది ఇందులో శక్తివంతమైన క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ 8ఎస్‌జెన్3 చిప్‌సెట్‌తో వస్తుంది. ఇది గేమింగ్, అధిక పనితీరుకు అనువుగా ఉంటుంది. మొత్తం మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. 8జీబీ‌ం 256జీబీ వేరియంట్ ధరను రూ.51,999గా కంపెనీ పేర్కొంది. 12జీబీ‌ం 256జీబీ వేరియంట్ ధర రూ.56,999, 12జీబీ‌ం 512 జీబీ వేరియంట్ ధర రూ.61,999గా నిర్ణయించింది.ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యెస్ బ్యాంక్ కార్డులపై 10% వరకు డిస్కౌంట్ అందిస్తోంది. రూ.1,499 వివో ఇయర్ బడ్స్ ను ఉచితంగా పొందవచ్చు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, వివో ఆన్‌లైన్ స్టోర్లలో లభిస్తున్నాయి.

## తగ్గనున్న వంటనూనెల ధరలు!



**న్యూఢిల్లీ :** వంటనూనెల ధరలు మరింత తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. క్రూడ్ వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని 10 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ నిర్ణయం మే 31 నుంచి అమల్లోకి రానున్నట్లు కేంద్ర సర్కార్ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో వెల్లడించింది. ప్రస్తుతం క్రూడ్ పామాయిల్, క్రూడ్ సోయా ఆయిల్, క్రూడ్ సన్‌ఫ్లవర్‌పై 20 శాతం దిగుమతి సుంకం విధిస్తున్నారు. దేశీయంగా వినియోగిస్తున్న వంటనూనెల్లో 70 శాతం దిగుమతులపై ఆధారపడుతున్నది. ప్రస్తుతం ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ దేశాల నుంచి అధికంగా పామాయిల్‌ను భారత్ దిగుమతి చేసుకుంటున్నది. అలాగే సన్‌ఫ్లవర్ ఆయిల్‌ను అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నది. కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయంతో వంటనూనెల ధరలు మరింత తగ్గనున్నాయని, అలాగే డిమాండ్ కూడా మరింత పెరిగే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. ఈ మూడు చమురులపై మొత్తం దిగుమతి సుంకం 27.5 శాతం నుంచి 16.5 శాతానికి దిగిరానున్నది. సెప్టెంబర్ 2024లో క్రూడ్, రిఫైన్ వంటనూనెలపై కస్టమ్స్ సుంకాన్ని 20 శాతానికి పెంచిన విషయం తెలిసిందే.

## ఫోక్స్‌వ్యాగన్ మరో కారు



హైదరాబాద్, ఫిబ్రవరి 21: ఫోక్స్‌వ్యాగన్ మరో లగ్జరీ కారును దేశీయ మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్‌యూవీ విభాగాన్ని మరింత బలోపేతం చేసే ఉద్దేశంలో భాగంగా సంస్థ 'టేరాన్ ఆర్ లైన్' మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ కారు ప్రారంభ ధర రూ.46.99 లక్షలుగా నిర్ణయించింది. ఏడుగురు కూర్చోవడానికి వీలుండే విధంగా డిజైన్ చేసిన ఈ మాడల్ 2.0 లీటర్ల 4-సిలిండర్ టర్బో పెట్రోల్ ఈవీఓ4 ఇంజిన్‌తో రూపొందించింది. కేవలం 7.3 సెకండ్లలో 100 కిలోమీటర్లు ప్రయాణించనున్న ఈ కారు గంటకు 200 కిలోమీటర్లకు పైగా దూసుకుపోనున్నది. పానోరమిక్ సన్‌రూఫ్, రియర్ సన్ షేడ్స్, 15 ఇంచుల ఇన్ఫోటైన్‌మెంట్ స్క్రీన్, ఫుల్-డిజిటల్ కాక్‌పిట్, 9 ఎయిర్‌బ్యాగ్‌లు, 14 అటానమస్ ఫీచర్లతో రూపొందించింది.

## ప్రీమియం ఫీచర్లతో బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్

చైనా మొబైల్ తయారీ సంస్థ ఇన్ఫినిక్స్ బడ్జెట్ ధరల్లో కొత్త స్మార్ట్ ఫోన్ తీసుకువచ్చింది.'ఇన్ఫినిక్స్ నోట్ ఎడ్జ్ 5జీ' పేరుతో భారత మార్కెట్‌లో విడుదల చేసింది. 6 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 21,999గా, 8 జీబీ ర్యామ్, 128 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 23,999గా, 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్ ధర రూ. 25,999గా నిర్ణయించారు.

లాంచ్ ఆఫర్‌లో భాగంగా 12 నెలల సాధారణ వారెంటీతో పాటు 12 నెలల ఎక్స్‌టెండెడ్ వారెంటీ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. వన్‌టైమ్ స్క్రీన్ రీప్లేస్‌మెంట్ ఆఫర్‌ను కూడా అందిస్తోంది. ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు కార్డుల ద్వారా చేసే కొనుగోళ్లపై రూ.2 వేల వరకు అదనపు డిస్కౌంట్ లభిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌తో పాటు కంపెనీ వెబ్‌సైట్, ఆఫ్ లైన్ స్టోర్స్‌లో ఈ ఫిబ్రవరి 25నుంచి సేల్ అందుబాటులో ఉండనుంది. సిల్క్ ఫైబర్ ఫినిష్, స్టెల్లర్ బ్లూ, లూనార్ టైటానియం కలర్స్‌లో మూడు వేరియంట్లలో లభిస్తుంది. ఇందులో 6.78 అంగుళాల 1.5కే త్రీడీ కర్వ్‌డ్ అమోలెడ్ డిస్‌ప్లే, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్, మీడియాటెక్ డైమెన్సిటీ 7100 ప్రాసెసర్, ఐపీ65 వాటర్ అండ్ డస్ట్ రెసిస్టెన్స్ సర్టిఫికెట్, ఆండ్రాయిడ్ 16 ఆధారిత ఎక్స్‌ఓఎస్ 16 ఆపరేటింగ్ సిస్టం తదితర ఫీచర్లు ఉన్నాయి. వెనకవైపు 50 మెగా పిక్సెల్ మెయిన్ కెమెరాతో పాటు 8 మెగా పిక్సెల్ అల్ట్రా వైడ్ లెన్స్‌తో కూడిన డ్యుయల్ కెమెరా సెట్ అప్ ఉంది. ముందువైపు సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 13 మెగా పిక్సెల్ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. 6500 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 45డబ్ల్యూ ఫాస్ట్ ఛార్జింగ్ సదుపాయంతో వస్తోంది.



5జీ, డ్యూయల్ 4జీ వీఓఎల్ఈటీ కనెక్టివిటీ సపోర్టులున్నాయి. వై--ఫై, బ్లూటూత్ 5.4, జీపీఎస్, ఎన్ఎఫ్‌సీ ఉన్నాయి. యూఎస్‌బీ టైప్--సీ పోర్ట్, ఐఆర్ సెన్సార్ ఉన్నాయి. ఇన్--డిస్‌ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సార్‌లున్నాయి.

# స్పోర్ట్స్

## భళా అమ్మాయిలు..
## ఆసియా కప్ కొల్లగొట్టిన టీమిండియా!




అంతర్జాతీయ క్రికెట్‌లో భారత అమ్మాయిలు వరుసగా ట్రోఫీలు పట్టేస్తున్నారు. నిరుడు హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిడియా తొలిసారి వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా అవతరించగా.. రాధా యాదవ్ బృందం మహిళల ఆసియా కప్ రైజింగ్స్ స్టార్స్‌లో విజేతగా నిలిచింది. సెమీఫైనల్లో శ్రీలంకను చిత్తు చేసిన టీమిండియా ఆదివారం జరిగిన ఫైనల్లో బంగ్లాదేశ్‌పై పంజా విసిరింది. ఓపెనర్లు విఫలమైనా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) అర్ధ శతకంతో.. రాధా యాదవ్(38) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో మెరవగా.. ప్రేమా రావత్(3-12) ధాటికి బంగ్లా కుప్పకూలింది. 46 పరుగుల తేడాతో ప్రత్యర్థిని మట్టికరిపించిన భారత్ టైటిల్ కొల్లగొట్టింది. సెమీఫైనల్లో భారీ విజయంతో శ్రీలంకను ఇంటికి పంపిన భారత ఏ జట్టు ఫైనల్లోనూ చెలరేగింది. అజేయంగా టైటిల్ పోరుకు దూసుకొచ్చిన బంగ్లాదేశ్‌ను ఆల్‌రౌండ్ షోతో దెబ్బతీసింది. శుభారంభం దక్కకపోయినా తేజల్ హసబ్నిస్(51 నాటౌట్) హాఫ్ సెంచరీతో చెలరేగగా.. రాధా యాదవ్(38) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఐదో వికెట్‌కు వీరు 69 రన్స్ జోడించి పరువు కాపాడారు. 135 పరుగుల ఛేదనలో బంగ్లాదేశ్‌ను భారత బౌలర్లు వణికించారు.

**అటు ప్రేమ.. ఇటు తనూజ**

టీమిండియా నిర్దేశించిన ఛేదనలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యం దిశగా సాగలేదు. ఓపెనర్ ఇష్మా తంజిమ్(3)ను ఔట్ చేసిన సైమా థాకొర్ వికెట్ల వేటకు తెరసింది. షమీమా సుల్తానా(20)ను వెనక్కి పంపిన ప్రేమా రావత్(3-21) ప్రత్యర్థిని మరింత దెబ్బతీసింది. రాధా యాదవ్ ఓవర్లో షర్మీన్ సుల్తానా(18) డగౌట్ చేరగా.. ప్రమాదకరమైన సదియా అక్తర్(10), లతా మొండల్(1)ను ఔట్ చేసిన ప్రేమ మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పింది. మరో ఎండ్‌లో తనూజ కన్వర్(2-11) సైతం చెలరేగగా బంగ్లా కోలుకోలేకపోయింది. షోఫియా ఖాతూన్(9)ను తనూజ ఔట్ చేయగా బంగ్లా 88 పరుగులకే ఆలౌటయ్యింది.

## పాకిస్తాన్ సూపర్ లీగ్‌లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్




పాకిస్తాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్) 2026లోకి మరో సౌతాఫ్రికా క్రికెటర్ చేరాడు. ఈ లీగ్‌లో ఇప్పటికే చాలామంది సౌతాఫ్రికా ఆటగాళ్లు పాల్గొంటుండగా.. తాజాగా యువ వికెట్‌కీపర్ బ్యాటర్ రూబిన్ హెర్మన్ వీరి సరసన చేరాడు. హెర్మన్‌ను లాహోర్ ఖలందర్స్ ఫ్రాంచైజీ సొంతం చేసుకుంది. ఖలందర్స్‌తో జతకట్టిన అనంతరం హెర్మన్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు దక్కింది. ఫాఫ్ డుప్లెసిస్ తర్వాత ఖలందర్స్‌కు ప్రాతినిధ్యం వహించిన రెండో సౌతాఫ్రికన్‌గా హెర్మన్ గుర్తింపు పొందాడు. గతేడాది చివర్లో డుప్లెసిస్ ఐపీఎల్ వేలం నుంచి తప్పుకొని పీఎస్ఎల్‌లో చేరాడు. 14 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లో దాదాపు 4,800 పరుగులు చేసిన డుప్లెసిస్, పీఎస్ఎల్ ఆడటం అప్పట్లో సంచలనం. ఈ ఏడాది ఐపీఎల్ విండోలో మరో సౌతాఫ్రికా ఆటగాడు పీఎస్ఎల్‌లో పాల్గొంటుండటం ఆసక్తికరం. 29 ఏళ్ల హెర్మన్ జూనియర్ టీ20 ఛాలెంజ్ 2023-24లో 436 పరుగులు చేసి తొలిసారి వెలుగులోకి వచ్చాడు. ఆతర్వాత ఎస్ఏ20లో పార్ల్ రాయల్స్ తరఫున ఆడాడు. 2025 ఎడిషన్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్‌పై ఒత్తిడిలో 81లి పరుగులు చేసి ప్రతిభను చాటుకున్నాడు. ఆ ఎడిషన్‌లో 226 పరుగులు చేశాడు. మొత్తం టీ20 కెరీర్‌లో హెర్మన్ 1,497 పరుగులు చేశాడు. ఇందులో ఓ శతకం, 8 అర్ధ శతకాలు ఉన్నాయి.

**లాహోర్ జట్టు వ్యూహం**

లాహోర్ జట్టు ఇప్పటికే ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, ఉసామా మిర్, హాసీబుల్లా ఖాన్ వంటి స్థానిక ఆటగాళ్లను కలిగి ఉంది. హెర్మన్ చేరికతో ఆ ఫ్రాంచైజీ బ్యాటింగ్ బలం మరింత పెరుగనుంది. హెర్మన్ మిడిలార్డర్‌లో కీలకమైన బ్యాటర్. అతన్ని 5 లేదా 6వ స్థానంలో ఉపయోగించుకోవచ్చు. స్ట్రైక్ రొటేట్ చేయడం, డెత్ ఓవర్లలో బౌండరీలు కొట్టడం హెర్మన్ ప్రత్యేకత.

## స్పిన్ వ్యూహానికి శ్రీలంక చిత్తు..
## సూపర్ 8లో ఇంగ్లండ్ బోణీ..!




స్వదేశంలో స్పిన్ అస్త్రంతో ప్రత్యర్థులను దెబ్బతీయాలనుకున్న శ్రీలంకకు ఇంగ్లండ్ పెద్ద షాకిచ్చింది. పల్లెకెల్ స్టేడియంలో విల్ జాక్స్(3-22) తిప్పేయగా.. పవర్ ప్లేలోనే కష్టాల్లో పడిన లంక.. ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. 150 పరుగుల ఛేదనలో టాపార్డర్, మిడిలార్డర్ చేతులెత్తేయగా.. కెప్టెన్ దసున్ శనక(30) పోరాడినా సరిపోలేదు. తడబడుతూ సాగిన ఆతిథ్య జట్టు ఇన్నింగ్స్‌కు ఆదిల్ రషీద్(2-13) తెరదించగా.. 51 పరుగుల తేడాతో గెలుపొందిన ఇంగ్లండ్ అదిరే బోణీ కొట్టింది. సొంతగడ్డపై చెలరేగాలనుకున్న శ్రీలంకను ఇంగ్లండ్ స్పిన్ అస్త్రంతో పడగొట్టింది. సూపర్ 8లో లంక నుంచి స్పిన్ ముప్పును ఊహించిన హ్యారీ బ్రూక్ సేన అందుకు తగ్గట్టే సన్నద్ధమైంది. కానీ.. తీరా మైదానంలోకి దిగాక ఫిల్ సాల్ట్(62) ఒక్కడే రాణించగా ప్రత్యర్థికి 150 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఫేవరెట్ లంక తమకు కొట్టినపిండి అయిన పల్లెకెలె స్టేడియంలో అలవోకగా గెలుస్తుందని అభిమానులు అనుకున్నారు. కానీ, పవర్ ప్లేలోనే ఇంగ్లండ్ విజయం దిశగా నడిచింది.

**34కే ఐదు వికెట్లు**

డేంజరస్ ఓపెనర్ పథుమ్ నిశాంక(9)ను రెండో ఓవర్లోనే ఔట్ చేసి జోఫ్రా ఆర్చర్(2-20) తొలి బ్రేకివ్వగా.. అక్కడి నుంచి విల్ జాక్స్(3-22)తన స్పిన్ మ్యాజిక్ చూపించాడు. రిటర్న్ క్యాచ్‌తో కుశాల్ మెండిస్(4)ను వెనక్కి పంపిన అతడు.. పవన్ రత్నాయకే(0), దునిత్ వెల్లలాగే(10)లను వెనక్కి పంపి ఆతిథ్య జట్టును కష్టాల్లోకి నెట్టాడు. పవర్ ప్లే చివరి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన వెల్లలాగే.. మిడాఫ్‌లో షాట్‌కు యత్నించి బ్రూక్ చేతికి చిక్కడంతో... 34కే లంక ఐదు కీలక వికెట్లు కోల్పోయింది. సగం వికెట్లు పడిన వేళ కెప్టెన్ దసున్ శనక(30)తో కలిసి జట్టును ఆదుకోవాలనుకున్న కమిందు మెండిస్(13).. డాసన్ వేసిన 9వ ఓవర్లో సిక్సర్ బాదాడు. కానీ, బంతికి రిటర్న్ క్యాచ్ ఇచ్చి లంక కష్టాలను మరింత పెంచాడు. శనకకు తోడుగా నిలిచే వారు కరువయ్యారు. ఓవర్టన్ ఓవర్లో హేమంత అనూహ్యంగా బ్యాట్‌ను వికెట్లకు తాకించి వెనుదిరిగాడు. అప్పటికే అవసరమైన నెట్‌రన్ రేటు పది దాటడంతో.. పెద్ద షాట్లు ఆడే క్రమంలో ఆదిల్ రషీద్(2-11) ఓవర్లో శనక వికెట్ ఇచ్చేశాడు. అతడు ఔటయ్యాక 13 పరుగులకే శ్రీలంక ఇన్నింగ్స్‌కు రషీద్ తెరదించాడు. ఆల్‌రౌండ్ షోతో ఆతిథ్య జట్టుకు చెక్ పెట్టిని ఇంగ్లండ్ 51 పరుగులతో గెలుపొంది.. గ్రూప్ బీలో బోణీ కొట్టింది.

**సాల్ట్ ఒక్కడే**

సూపర్ 8 తొలి పోరులో ఇంగ్లండ్ ఆరంభంలో తడబడినా పోరాడగలిగే స్కోర్ చేసింది. శ్రీలంక స్పిన్నర్లు దునిత్ వెల్లలాగే(3-26), థీక్షణల(2-21)లు అద్భుతంగా కట్టడి చేయడంతో టాపార్డర్, మిడిలార్డర్ తేలిపోయింది. ఓవైపు వికెట్లు పడుతున్నా ఓపెనర్ ఫిల్ సాల్ట్(62) ఒత్తిడిలోనూ అర్ధ శతకంతో మెరిశాడు. ఆఖర్లో విల్ జాక్స్(13), జేమీ ఓవర్టన్(10 నాటౌట్)లు దూకుడుగా ఆడడంతో ఇంగ్లండ్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 150 పరుగులు చేసింది.

ప్రతిఘటన
తెలుగు దిన పత్రిక
సోమవారం 23
ఫిబ్రవరి 2026

## హనుమంతుడి జన్మస్థలంలో గ్రాండ్‌గా మొదలైన 'జై హనుమాన్' రిషబ్ శెట్టితో భారీ సీక్వెల్!



విజయనగర సామ్రాజ్య పుణ్యక్షేత్రం, హనుమంతుడి జన్మస్థలంగా భావించే హంపిలోని అంజనాద్రి బెట్ట సాక్షిగా 'జై హనుమాన్' చిత్రానికి ఆదివారం అత్యంత వైభవంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్ నుంచి వస్తున్న ఈ భారీ సీక్వెల్‌ను మైత్రీ మూవీ మేకర్స్ ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. ఈ వేడుకలో చిత్ర బృందంతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. గత ఏడాది కాలంగా రణవీర్ సింగ్ ప్రాజెక్ట్ వంటి ఇతర పరిణామాల వల్ల ఈ సినిమా ఆలస్యమైనప్పటికీ, నేటి పూజా కార్యక్రమాలతో పనులు అధికారికంగా ఊపందుకున్నాయి. ఈ చిత్రంలో హనుమంతుడి పాత్రలో 'కాంతార' ఫేమ్ రిషబ్ శెట్టి నటిస్తుండగా, రానా దగ్గుబాటి ఒక కీలక పాత్రలో మెరవనున్నారు. మొదటి భాగం హీరో తేజ సజ్జా కూడా ఈ సినిమాలో భాగం కావడం విశేషం. పాన్ ఇండియా స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ 2026 మార్చి లేదా ఏప్రిల్ నెలల్లో ప్రారంభం కానుంది. మొదటి భాగం కంటే విజువల్స్ పరంగా అద్భుతంగా ఉండేలా 'అంజనాద్రి 2.0' పేరుతో సరికొత్త ప్రపంచాన్ని దర్శకుడు ప్రశాంత్ వర్మ సిద్ధం చేస్తున్నారు. భక్తి, యాక్షన్ కలగలిపి ఈ చిత్రాన్ని అద్భుత దృశ్యకావ్యంగా మలిచేందుకు చిత్ర యూనిట్ సన్నద్ధమవుతోంది.



## ఈ అవార్డ్ వారికే అంకితమిస్తున్నా: అల్లు అర్జున్

పుష్ప-2 మూవీకి ఉత్తమ నటుడిగా ఫిల్మ్ ఫేర్ అవార్డ్ రావడంపై ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ స్పందించారు. ఇంత అద్భుతమైన గౌరవం ఇచ్చినందుకు ఫిల్మ్‌ఫేర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నన్ను ఇంతలా ప్రేమించే దేశంలో అవార్డ్ స్వీకరించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీ అందరి ప్రేమ, ఆశీర్వాదాలకు తానెప్పుడు విధేయుడినని ట్వీట్ చేశారు. ఈ అవార్డ్‌ను హద్దుల్లేని నా అభిమానుల ప్రేమకు అంకితం చేస్తున్నట్లు బన్నీ ప్రకటించారు. కాగా..కేరళలోని కొచ్చిన్‌లో జరిగిన 70వ ఫిల్మ్ ఫేర్ అవార్డ్స్‌లో ఐకాన్‌స్టార్ ఉత్తమ నటుడిగా అవార్డ్ అందుకున్నారు. 2024లో విడుదలైన పుష్ప-2 చిత్రానికి ఈ ఘనత సొంతం చేసుకున్నారు. ఈ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా సుకుమార్, బెస్ట్ మ్యూజిల్ ఆల్బమ్‌కు దేవీశ్రీ ప్రసాద్, ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ విభాగంలో రామకృష్ణ అండ్ మోనిక అవార్డులు అందుకున్నారు. అంతేకాకుండా 2024లో ఉత్తమ చిత్రంగా పుష్ప-2 నిలిచింది. ఈ చిత్రం తెలుగు ఇండస్ట్రీలో అత్యధికంగా ఐదు విభాగాల్లో ఫిల్మ్ ఫేర్ అవార్డులు కొల్లగొట్టింది.



## సోషల్ మీడియా ట్రోలింగ్.. సామ్ రియాక్షన్ ఇదే!

దర్శకుడు రాజ్ నిడిమోరును పెళ్లి చేసుకున్నాక సమంత ముఖం వెలిగిపోతోంది. ఒకప్పుడు విచారంగా కనిపించే తన ముఖం ఇప్పుడు వెయ్యి ఓట్ల బల్బులా ప్రకాశిస్తోంది. ప్రస్తుతం సంతోషకర జీవితం గడుపుతున్న సామ్ మా ఇంటి బంగారం అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పెళ్లి తర్వాత ఆమె నుంచి వస్తున్న మొదటి సినిమా ఇదే కావడం విశేషం! ఈ చిత్రం మే 15న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

**ఏదీ నన్ను కదిలించలేదు**

ఇదిలా ఉంటే తాజాగా తను సోషల్ మీడియాలో అభిమానులతో చిట్‌చాట్ చేసింది. ఫ్యాన్స్ అడిగిన పలు ప్రశ్నలకు ఓపికగా సమాధానాలిచ్చింది. సోషల్ మీడియాలో వచ్చే ప్రశంసలు, విమర్శలపై మీరు ఎలా స్పందిస్తారు? అని ఓ వ్యక్తి అడిగారు. అందుకు సమంత స్పందిస్తూ.. ప్రశంసలు నన్ను కదిలించలేవు. అలాగే విమర్శలు కూడా నన్ను ఎఫెక్ట్ చేయవు. కానీ, నెగెటివిటీని నా ఇంటివరకు తీసుకొస్తే మాత్రం మిమ్మల్ని బ్లాక్ చేస్తాను.

**దానర్థం అదే..**

అలా నా స్పేస్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకుంటాను. మిమ్మల్ని బ్లాక్ చేశానంటే నేను బాధపడ్డానని కాదు. మీలాంటివారికి నాదగ్గర చోటు లేదని అర్థం అని రిప్లై ఇచ్చింది. మీలోని ఓ ఫన్నీ థింగ్ ఏంటని అడగ్గా.. కిందపడి మరీ నవ్వుతానంది. ఎక్కువ బాధ లేదా ఒత్తిడికి గురైనప్పుడు ఏం చేస్తారని అడగ్గా.. ధ్యానం చేస్తానని బదులిచ్చింది.

**సినిమా**

మా ఇంటి బంగారం సినిమా విషయానికి వస్తే.. ఇందులో సమంత పెళ్లయిన అమ్మాయిగా కనిపించనుంది. అలాగే ఆపద వచ్చినప్పుడు కత్తి పట్టేందుకు కూడా వెనుకాడని శివంగిగానూ అలరించనుంది. గుల్షన్ దేవయ్య కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి నందిని రెడ్డి దర్శకత్వం వహించింది.



## నిరాశపర్చిన రాజాసాబ్.. పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ప్రభాస్ మరో ఛాన్స్.. !

గ్లోబర్ స్టార్ యాక్టర్ ప్రభాస్ రీసెంట్‌గా రాజాసాబ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడని తెలిసిందే. టాలీవుడ్ టాప్ లీడింగ్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ తెరకెక్కించిన ఈ చిత్రం బాక్సాఫీస్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయలేకపోయింది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి నిరాశనే మిగిల్చిందని చెప్పాలి. ఇదిలా ఉంటే ప్రభాస్ మరోసారి ఇదే బ్యానర్‌లో సినిమా చేసేందుకు రెడీ అవుతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఫెయిల్యూర్ తర్వాత ప్రభాస్ నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌ను కలిసి మరో సినిమా చేస్తానని హామీనిచ్చాడట. బాక్సాఫీస్ ఫలితాలతో సంబంధం లేకుండా ప్రభాస్ తీసుకున్న ఈ నిర్ణయం మరోసారి తన గొప్ప మనసును చాటుతోంది. ప్రభాస్, పీపుల్ మీడియా ఫ్యాక్టరీ రీయూనియన్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే అధికారిక ప్రకటన రాబోతుందట. మరి ఈ సినిమాను డైరెక్ట్ చేయబోయేది ఎవరో..? ప్రభాస్ స్టార్‌డమ్‌కు తగ్గకుండా ఎలివేట్ చేసేలా ఈ కొత్త ప్రాజెక్టు ఉండాలని ఆశిస్తున్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఎప్పుడెప్పుడు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఉంటుందా..? అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు మూవీ లవర్స్. ప్రభాస్ ఖాతాలో ప్రస్తుతం సలార్ 2తోపాటు ఫౌజీ, స్పిరిట్ సినిమాలున్నాయి.

PRINTED AND PUBLISHED BY KANUGULA SRINIVAS ON BEHALF OF VIPLAV MEDIA PVT. LTD. AT M/S SMIL YS ONLINE, H-NO : 6-7-48 VANASTHALIPURAM SHOPPING COMPLEX, RANGAREDDY DIST, TELANGANA - 500070 AND PUBLISHED AT VIPLAV MEDIA PVT LTD. H-NO: 18-7-496 KANDIKAL GATE, CHARMINAR, HYDERABAD, TELANGANA - 500053. CEO & CHEIF EDITOR: VANGA NAGARAJU, EDITOR: VANGA VIPLAV. UDYAM- TS-02-0308842 PHONE NO: +919394517067, +918499094183.